


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 197, పేజీలు - 08

మంగళవారం, డిసెంబర్ 30, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ

## - హాజరైన విపక్ష నేత కేసీఆర్

- ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్న బీఆర్ఎస్
- అసెంబ్లీ ముట్టడికి యత్నించిన మాజీ సర్పంచ్‌ల అరెస్ట్
- సభ చుట్టూ వెయ్యి మంది పోలీసులతో భారీ బందోబస్తు



**తెలంగాణ శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఓవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పూర్తిస్థాయిలో సభకు హాజరుకాగా, మరోవైపు మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి యత్నించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విపక్ష నేతగా కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావు తదితర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యారు.**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ అసెంబ్లీలో సోమవారం నాడు అత్యంత ఆసక్తికరమైన, హుందాతనంతో కూడిన సన్నివేశం చోటుచేసుకుంది. అదే సమయంలో జరిగిన ఘటన రాజకీయంగా హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలోకి వచ్చిన సందర్భంలో ప్రతిపక్ష నేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ వద్దకు వెళ్లి ఆయన యోగక్షేమాలను సరదాగా పలకరించారు. తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా రెండు సార్లు బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉన్నప్పటికీ, కేసీఆర్ తన సంస్కారాన్ని చాటుకుంటూ రేవంత్ రెడ్డి రాకను గమనించి వెంటనే లేచి నిలబడి ప్రతి నమస్కారం చేశారు. రేవంత్ రెడ్డికి స్వయంగా షేక్ హ్యాండ్ ఇచ్చి తన హుందాతనాన్ని ప్రదర్శించారు. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి, మరొకరి హోదాను గౌరవించుకుంటూ సాగిన ఈ అరుదైన కలయిక సభలో అందరి దృష్టిని ఆకర్షించింది. రేవంత్ రెడ్డి చూపిన మర్యాద, కేసీఆర్ స్పందించిన తీరుపై ప్రస్తుతం సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి.

### కేటీఆర్ తీరుపై కాంగ్రెస్ విమర్శలు..

ఇదే సమయంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై సోషల్ మీడియాలో భిన్నమైన చర్చ నడుస్తోంది. సభా నాయకుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ

2లో..

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం

### - అసోం బహిరంగ సభలో మాట్లాడిన అమిత్ షా



**గౌహతి (ప్రశ్న న్యూస్)** భారతదేశంలో ఎక్కడ ఉన్నా బంగ్లాదేశ్ చొరబాటుదారులను వెనక్కి పంపిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులకు ముప్పుగా పరిణమిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వారిని ఓటు బ్యాంకుగా చూస్తోందని ఆయన ఆరోపించారు. ఆ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తోందని విమర్శించారు. అసోంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఏళ్ల అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటంతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపై దృష్టి

2లో..

# ఏపీలో కొత్తగా మూడు జిల్లాలు

## కేబినెట్ ఆమోదం

- ప్రజాభీష్టం మేరకు జిల్లాల పునర్వ్యవస్థీకరణకు క్యాబినెట్ ఆమోదం
- మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు నిర్ణయం
- అన్నమయ్య జిల్లా పేరు యథాతథం, జిల్లా కేంద్రం మదనపల్లెకు మార్పు
- మొత్తం 24 కీలక అంశాలపై చర్చించి ఆమోదించిన మంత్రివర్గం
- జనవరి 1 నుంచి కొత్త మార్పులు అమల్లోకి



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిపాలనలో చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కేబినెట్ మూడు కొత్త జిల్లాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని మొత్తం జిల్లాల సంఖ్య 26 నుండి 28కి చేరాయి. మార్కాపురం, పోలవరం, మదనపల్లె కొత్త జిల్లాలుగా జనవరి ఒకటి నుంచి ఉనికిలోకి రానున్నాయి. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసినట్లుగా మంత్రులు ప్రకటించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాంతీయ డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని మార్కాపురం, పోలవరం,

2లో..

## కేసీఆర్, నేను మాట్లాడుకున్నది మీకెలా చెబుతాను

### - మీడియా ప్రతినిధులతో రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో తాను మాట్లాడిన విషయాలు మీకెలా చెబుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీకి హాజరైన కేసీఆర్ కొద్ది నిమిషాల్లోనే వెళ్లిపోయారు. శాసనసభ ప్రారంభం కాగానే రేవంత్ రెడ్డి, కేసీఆర్ వద్దకు వెళ్లి కరచాలనం చేసి ఆయన క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ సభలో రెండు నిమిషాలు మాత్రమే ఉన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ను అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశానని తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రతి సభ్యుడిని తాము గౌరవిస్తామని, కేసీఆర్‌ను ఈరోజే కాకుండా, ఆసుపత్రిలో ఉన్నప్పుడు కూడా కలిశానని గుర్తు చేశారు. అసెంబ్లీ నుంచి ఆయన వెంటనే ఎందుకు వెళ్లారో కేసీఆర్‌నే అడగాలని అన్నారు. మీరిద్దరు ఏం మాట్లాడుకున్నారని విలేకరులు ప్రశ్నించగా, తామిద్దరం మాట్లాడుకున్నది మీకెలా చెబుతామని బదులిచ్చారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. సభలో ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా సమాధానం చెప్పేందుకు మంత్రులు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాల వారీగా మంత్రులు ఎదురుదాడికి సిద్ధం కావాలని అన్నారు. సభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు ప్రాధాన్యత ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని సూచించారు. జనవరి 4 వరకు సభ జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

## అన్ని ఆలయాల్లో 'శ్రీవారి సేవకులు' తరహా విధానం

### - పాలనపై సీఎం చంద్రబాబు సమీక్ష

- వివిధ శాఖలకు కీలక సూచనలు, ఆదేశాలు
- ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా అందాలి, సర్వేల్లో తప్పులు జరగొద్దని స్పష్టీకరణ
- ధాన్యం కొనుగోళ్లలో ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక




అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో తిరుమల శ్రీవారి సేవకుల తరహాలో స్వచ్ఛంద సేవలను ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత సులభంగా అందించాలని, భూ సర్వేల్లో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వరాదని స్పష్టం చేశారు. సోమవారం నాడు అమరావతిలోని ఆర్టీజీఎస్ నుంచి రెవెన్యూ, వ్యవసాయం, వైద్యారోగ్యం,

2లో..

## మరో చెరువుకు పునరుజ్జీవం

### - 104 లారీల చెత్తను తొలగించిన హైడ్రా




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలోని ప్రగతినగర్ ప్రాంతంలో ఉన్న అంబీర్ చెరువుకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు హైడ్రా నడుం బిగించింది. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన ఈ చెరువు కాలక్రమేణా నగర విస్తరణ, అజాగ్రత్త వల్ల వ్యర్థాల నిలయంగా మారింది. ఈ దుస్థితిని గమనించిన స్థానికులు 'ఫర్ ఏ బెటర్ సొసైటీ' ప్రతినిధులు ప్రజావాణిలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు.

2లో..

## హైదరాబాద్‌లో ఉత్కంఠ రేపుతున్న "ఆపరేషన్ చబూతర్"

### - పక్కా వ్యూహాలతో ఆకతాయిలకు చెక్!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఏడాదంతా ఒకెత్తైతే, డిసెంబర్ 31వ తేదీ రాత్రి పరిస్థితి పూర్తిగా విభిన్నం. హద్దులు దాటిన ఆకతాయిల వెకిలి చేష్టలు, డ్రగ్స్ మత్తు తలకెక్కి మృగాలుగా మారిన చేసే ఆగడాలు, పీకల దాకా తాగి , మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే మందుబాబుల ఓవర్ యాక్షన్ ఇలా ఆ రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఓవైపు, అంతే స్థాయిలో ఎంతో మంది అమాయకుల జీవితాల్లో విషాన్ని నింపే చీకట్లు మరో వైపు. ఈ పరిస్థితి ప్రతీ ఏడాది సర్వసాధారణమైనప్పటికీ , సాధ్యమైనంత వరకూ ప్రమాదాలు జరగకుండా, క్రైమ్ అదుపు చేసేందుకు పోలీసులు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఈసారి డిసెంబర్ 31వ తేదీ ఆకతాయిల ఆట కట్టించేందుకు ఆపరేషన్ చబూతర్ పేరుతో రంగంలోకి దిగారు హైదరాబాద్ పోలీసులు..

### ఏంటీ ఆపరేషన్ చబూతర్?

హైదరాబాద్ నగరంలో ఈ ఏడాది పోలీసులు వినూత్నంగా చేపట్టిన ఆపరేషన్ చబూతర్ అనేది న్యూ ఇయర్ వేడుకల పేరుతో జరిగే ఆగడాలను, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను, నిబంధనలను ఉల్లంఘించి , అమాయకుల ప్రాణాలను తీసే సరదాలను అడ్డుకోవడం. ఈ ఆపరేషన్ చబూతర్ లక్ష్యం న్యూ ఇయర్ వేడుకల్లో క్రైమ్ సాధ్యమైనంత వరకూ కట్టడి చేయడం.

2లో..

## నా పేరు రవి... ఐ బొమ్మ రవి కాదు

### - ఏదైనా కోర్టులో తేల్చుకుంటా




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఐ-బొమ్మ నిర్వాహకుడు రవి కేసులో పోలీసుల కస్టడీ సోమవారంతో ముగిసింది. సోమవారం సైబర్ క్రైమ్ పోలీసులు అతడ్ని నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం మీడియా అడిగిన ప్రశ్నకు ఇమంది రవి షాకింగ్ రిప్లై ఇచ్చారు. నా పేరు రవినా.? ఐ బొమ్మ రవినా.? ఐ బొమ్మ నాదే అనడానికి ఆధారాలు ఉన్నాయా.? ఆధారాలు లేకుండా ఎలా మాట్లాడతారు.? అని ప్రశ్నించాడు. అంతేకాక ఏదైనా కోర్టులో తేల్చుకుంటా అంటూ వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.

తెలుగు చిత్ర పరిశ్రమంలో అలజడి సృష్టించిన ఐ బొమ్మ రవి 12 రోజుల పోలీస్ కస్టడీ నేటితో ముగిసింది. దాంతో అతడ్ని పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. ఈ క్రమంలో కోర్టు నుంచి బయటకు వస్తూ రిపోర్టర్ అడిగిన పలు ప్రశ్నలకు విసుక్కుంటూ సమాధానం ఇచ్చారు. నా పేరు ఐ బొమ్మ రవినా.? ఐ బొమ్మ నాదే అనడానికి ఆధారాలు ఉన్నాయా.? ఆధారాలు లేకుండా ఎలా మాట్లాడతారు.? అని సవాల్ విసిరారు. కోర్టులో చూసుకుంటా అంటూ వెళ్లిపోయారు. మరో ప్రశ్నకు సమాధానం చెప్తూ 'మీ మీడియాకి చెప్పడం వల్ల ఉపయోగం ఏంటి.? మీరేమైనా కోర్టులా అంటూ ఇమంది రవి ఫైర్ అయ్యారు."నేను ఎక్కడికీ పారిపోలేదు. ఇన్నాళ్లూ కూకట్ పల్లిలోనే ఉన్నా, నాపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం.. బెట్టింగ్ యాప్స్ తో సంబంధాలున్నాయని ఎవరు చెప్పారు.? పోలీసులు చెబితే నేరం చేసినట్టేనా ఏదైనా కోర్టులోనే

2లో..

## మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలపై కీలక అప్‌డేట్

### - ఓటరు జాబితా తయారీకి ఎస్ఈసీ కసరత్తు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఎన్నికల సందడి మొదలైంది. ఇటీవల పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా ముగియడంతో ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపాలిటీలు , కార్పొరేషన్లపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది.

### ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్..

రాష్ట్రంలోని 117 మున్సిపాలిటీలు, 6 నగర పాలక

2లో..

## 'పాత బాస్' కోసమే ఆ ప్రాజెక్టును నిలిపివేశారు

- కేసీఆర్‌కు పేరు వస్తుందన్న భయంతో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- ఆర్థిక ప్రయోజనాల కోసమే జీహెచ్ఎంసీ విభజనకు కుట్ర అంటూ ఫైర్
- ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ కావడం లేదని సీఎం చెప్పగలరా అని ప్రశ్న



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 'పాత బాస్', ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును ప్రసన్నం చేసుకునేందుకే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మాజీ సీఎం కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే భయంతో పాటు, చంద్రబాబుకు

2లో..

# ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ

సమీపంలోకి వచ్చినప్పుడు, తమ పార్టీ అధినేత వద్దకు వచ్చి పలకరించగా కేసీఆర్ లేచి నిల్చుని షేక్ హ్యాండ్ ఇచ్చారు. అయితే కేటీఆర్, కౌశిక్ రెడ్డి కనీసం లేచి నిలబడకపోవడంపై కాంగ్రెస్ శ్రేణులు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇది కేటీఆర్ అహంకారానికి నిదర్శనమని వారు ఆరోపిస్తుంటే, బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం దీనిని గట్టిగా సమర్థిస్తున్నాయి. తన తండ్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదని, రేవంత్ రెడ్డి చేసే నాటకాలకు కేటీఆర్ పడిపోరని వారు కౌంటర్ పోస్టులు పెడుతున్నారు. ఇలా కేసీఆర్, రేవంత్ ల స్నేహపూర్వక పలకరింపు ఎంత హాట్ టాపిక్‌గా మారిందో, కేటీఆర్ స్పందించని తీరు సైతం అంతే స్థాయిలో రాజకీయ చర్చకు దారితీసింది.

### సభ నుంచి ఎందుకు వెళ్లిపోయారో కేసీఆర్‌నే అడగండి: రేవంత్ రెడ్డి

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా పలకరించడంపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. సభలోని ప్రతి సభ్యుడిని తాము గౌరవిస్తామని, అందులో భాగంగానే కేసీఆర్‌ను కలిసి పలకరించానని స్పష్టం చేశారు. కేసీఆర్‌ను తానేదో ఈరోజే కొత్తగా కలవలేదని, గతంలో ఆయన అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నప్పుడు వెళ్లి పరామర్శించానని రేవంత్ గుర్తు చేశారు. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే కేసీఆర్ అసెంబ్లీ నుండి వెళ్ళిపోవడంపై స్పందించారు. కేసీఆర్ సభ నుంచి అంత త్వరగా ఎందుకు వెళ్ళాల్సి వచ్చిందో ఆయన్నే అడగాలని మీడియా వారికి సూచించారు. ఇద్దరు నేతలు కలుసుకున్న సమయంలో ఏం మాట్లాడుకున్నారనే విషయంపై మీడియా ప్రతినిధులు ఆరా తీయగా, రేవంత్ రెడ్డి తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తామిద్దరం వ్యక్తిగతంగా మాట్లాడుకున్న విషయాలను బయట అందరికీ ఎలా చెబుతామని సరదాగా వ్యాఖ్యానించారు. శాసనసభ వేదికగా ఇద్దరు అగ్ర నేతలు కరచాలనం చేసుకుంటూ, యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం సభలోని వారితో పాటు రాష్ట్ర ప్రజలను ఆకట్టుకుంది. రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, సభా సంప్రదాయాలను పాటిస్తూ ఒకరినొకరు గౌరవించుకోవడం మంచి పరిణామమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం

సారించిందని తెలిపారు. బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడిపించిందని కొనియాడారు. రాష్ట్రంలో పాతుకుపోయిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించడానికి బీజేపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. గత 11 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు.

# ఏపీలో కొత్తగా మూడు జిల్లాలు

మదనపల్లెలను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేస్తూ కేబినెట్ సబ్ కమిటీ నివేదికకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం మార్కాపురం జిల్లా. భౌగోళికంగా చాలా దూరంగా ఉన్న కలెక్టరేట్ కార్యాలయాలకు వెళ్లడం ఇక్కడి ప్రజలకు పెద్ద భారంగా ఉండేది. మార్కాపురం , కనిగిరి రెవెన్యూ డివిజన్లు ఈ జిల్లాలో ఉంటాయి. యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 11.42 లక్షలతో ఈ జిల్లా ఏర్పడుతుంది.రాయచోటి కేంద్రంగా ఉన్నా అన్నమయ్య జిల్లా కేంద్రంను మదనపల్లెకు మార్చారు. మదనపల్లెను జిల్లా కేంద్రం చేయాలనే డిమాండ్‌పై మంత్రివర్గంలో తీవ్ర చర్చ జరిగింది. రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఉద్వేగానికి లోనైనప్పటికీ, భౌగోళిక , పరిపాలనా కారణాల దృష్ట్యా మదనపల్లెను జిల్లా కేంద్రంగా ఖరారు చేశారు. మదనపల్లె ,కొత్తగా ఏర్పడిన పీలేరు రెవెన్యూ డివిజన్లు కలిపి జిల్లాగా ఉంటాయి. మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలతో ఈ జిల్లా ఉంటుంది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను పర్యవేక్షించడం , జెన్సీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా జిల్లా ఏర్పాటు చేశారు. కొత్త జిల్లాలకు తాత్కాలిక భవనాలను గుర్తించి, శాశ్వత కలెక్టరేట్లకు నిధులు కేటాయించనున్నారు. గతంలో జిల్లాల విభజన సమయంలో తప్పులు చేశారని దాని వల్లనే ప్రస్తుతం సమస్యలు వస్తున్నాయన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని మదనపల్లికి మార్చే విషయంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి అసంతృప్తికి గురైన మాట వాస్తవమేనని మంత్రులు మీడియా సమావేశంలో చెప్పారు. అయితే పరిపాలనా నిర్ణయాలలో భాగంగా తప్పలేదన్నారు. రాయచోటి అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు.

# హైదరాబాద్‌లో ఉత్కంఠ రేపుతున్న "ఆపరేషన్ చబూతర్"

ఒక్కమాటలో చెప్పాలంటే మీ వేడుకలు, ఇతర కుటుంబంలో విషాదాన్ని నింపకుండా చట్టపరిధిలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడమే ఈ ఆపరేషన్ చబూతర్ లక్ష్యం.

### చబూతర్ పేరుతో డిసెంబర్ 31వ తేది ఏం జరుగబోతోంది

డిసెంబర్ 31వ తేదీ టార్గెట్ గా వారం రోజుల ముందు నుంచే హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఆపరేషన్ చబూతర్ ను షురూ చేశారు పోలీసులు. అస్సలు కథ మరి కొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. 31వ తేదీన సరదాల పేరుతో గీత దాటొద్దంటూ ముందు నుంచే నగర ప్రజలను అప్రమత్తం చేసారు పోలీసు ఉన్నతాధికారులు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ఏకంగా నగరంలో 100కుపైగా ప్రాంతాల్లో ఏకకాలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించబోతున్నారు. ఆరోజు రాత్రి నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 3గంటల వరకూ నాన్ స్టాప్ గా నగరవ్యాప్తంగా 126 ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగనున్నాయి. ఈ తనిఖీలలో మద్యం సేవించి పట్టుబడితే ఈసారి ఏకంగా 6 నెలలు జైలు జీవితం , డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు న్యూ ఇయర్ బంపర్ ఆఫర్ గా 10వేలు ఫైన్ వేయడం తప్పదంటున్నారు. ఇలా నగరంలో తప్పతాగి ప్రాణాలు తీసే వాహనదారులకు డిసెంబర్ 31వ తేది చుక్కలు చూపించనున్నారు పోలీసులు.

న్యూయర్ రోజు ఫ్యామిలితో ఉంటారా లేక తప్పతాగి వాహనం నడిపి జైల్లో ఉంటారా మీరే తేల్చుకోండంటూ , మందుబాబుకు ఓపెన్ చాలెంజ్ విసిరారు. పార్టీ అంటే డ్రగ్స్ , డ్రగ్స్ ఉంటేనే పార్టీలో మజా అనేంతలా హైదరాబాద్ లో డ్రగ్స్ కల్చర్ పెరిగిపోయింది. అందులో న్యూ ఇయర్ పార్టీలంటే చెప్పక్కర్లేదు. ఈ నేపథ్యంలో డ్రగ్స్ సరఫరా ముఠాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. టెలిగ్రామ్, వాట్సాప్ లలో కోవర్టు గ్రూపులలో డీల్స్ ఫిక్స్ చేస్తున్న ముఠాలను టార్గెట్ చేశారు. మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న కేటుగాళ్లలోను జల్లెడ పట్టేందుకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఈగల్, టాస్క్ ఫోర్స్ టీమ్స్ ఎప్పటికప్పుడు మత్తుగాళ్లను ట్రాక్ చేసేందుకు పక్కా వ్యూహాలను సిద్ధం చేశారు.

నగర సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతోపాటు గంజాయి సరఫరాను కట్టడి చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగనున్నాయి. ఇప్పటికే పబ్ లో పార్టీల పేరుతో మత్తు పదార్థాలు సరఫరా, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తాట తీస్తామంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అర్ధరాత్రి 1గంట తరువాత బార్ లు ఓపెన్ లో ఉంటే తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరిస్తున్నారు. ఇలా ఈ డిసెంబర్ 31వ తేది రాత్రి స్పెషల్ ఆపరేషన్ చబూతర్ పేరుతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ , ఆకతాయిల బెండు తీసేందుకు సిద్ధమయ్యారు.

# నా పేరు రవి... ఐ బొమ్మ రవి కాదు

తేల్చుకుంటా, నేను కూకట్ పల్లిలోనే ఉన్నా కేవలం వేరే దేశపు సిటిజెన్ షిప్ మాత్రమే తీసుకున్నా" అని ఐ బొమ్మ రవి పేర్కొన్నారు.ఇక ఐ బొమ్మ రవిని నవంబర్ 18న సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సినిమాల పైరసీతో పాటు బెట్టింగ్ యాప్ ల ప్రమోషన్ కు పాల్పడిన నేపథ్యంలో అతడిపై మొత్తం 5 కేసులు నమోదు చేశారు.

పైరసీ సెల్ ఇచ్చిన ఫిర్యాదుతో ఒక కేసు.. అలాగే బెట్టింగ్ యాప్ ప్రమోషనల్ వ్యవహారంలో మరో కేసు నమోదు చేశారు. అలాగే తాజాగా ఐ బొమ్మ రవి కేసులో మరొకరి పేరు బయటకు రావడం సంచలనంగా మారింది. ప్రహ్లాద్ వెల్లేల పేరిట ఇమ్మడి రవి పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలపై కీలక అప్‌డేట్

సంస్థలలో ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. 2025 డిసెంబర్ 30వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ ప్రక్రియ 2026 జనవరి 10వ తేదీ వరకు కొనసాగనుంది. ముఖ్యంగా నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, కరీంనగర్, కొత్తగూడెం, రామగుండం కార్పొరేషన్లలో ఈ ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

### ఎన్నికల నిర్వహణ వెనుక ఉన్న కారణాలు

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఇప్పుడు అనివార్యంగా మారింది. దీనికి ప్రధాన కారణాల్లో కేంద్ర నిధుల రాక ఒకటి. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి పట్టణ స్థానిక సంస్థలకు అందాల్సిన సుమారు 700 కోట్ల రూపాయల నిధులు రావాలంటే మార్చి నాటికి ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. ఎన్నికైన పాలకవర్గాలు లేకపోతే ఈ నిధుల విడుదలలో సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతాయి. ఇప్పటికే 117 మున్సిపాలిటీల్లో పాలకవర్గాల గడువు ముగిసి సుమారు ఏడాది కావస్తోంది. ప్రస్తుతం ఇక్కడ ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రతినిధులు ఉంటేనే వార్డుల స్థాయిలో అభివృద్ధి వేగంగా జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే ఫిబ్రవరి నెలతో హైదరాబాద్ మహానగర పాలక సంస్థ గడువు ముగుస్తుంది. అలాగే మే నెలలో వరంగల్, ఖమ్మం, సిద్దిపేట వంటి ప్రధాన నగరాల పాలకవర్గాల గడువు కూడా పూర్తికానుంది. ప్రభుత్వం ప్రస్తుతం ఒకేసారి అన్ని మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాలా లేక విడతల వారీగా వెళ్లాలా అనే అంశంపై సమాలోచనలు చేస్తోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను కూడా మున్సిపల్ ఎన్నికలతో కలిపి నిర్వహించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు, ఓటర్ల జాబితా వంటి ప్రక్రియలు పూర్తయిన వెంటనే ఎన్నికల నగారా మోగే అవకాశం ఉంది. కొత్తగా ఓటు హక్కు పొందిన యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ పేర్లను జాబితాలో సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. స్థానిక అభివృద్ధిలో ఓటు అనేది కీలక ఆయుధమని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ప్రభుత్వం కోరుతోంది.

## 'పాత బాస్' కోసమే ఆ ప్రాజెక్టును నిలిపివేశారు

ఆగ్రహం కలుగుతుందనే ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి పనులను ముందుకు సాగనీయడం లేదని ఆయన విమర్శించారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, పాలమూరు ప్రాజెక్టుకు కేవలం 45 టీఎంసీల కేటాయింపులను అంగీకరించడం రాష్ట్రానికి నష్టదాయకమని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కృష్ణా జలాల్లో 299 టీఎంసీలకు అంగీకరించిందని, దాని ఆధారంగానే బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయింపులు పెంచాలని కేంద్రాన్ని కోరిందని గుర్తుచేశారు. కేసీఆర్ చిత్తశుద్ధి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిందని, దానిపై ఎన్ని విచారణలు జరిపినా రాజకీయంగా తమకు నష్టం లేదని, నీళ్లు ఇచ్చిందెవరో ప్రజలకు తెలుసని అన్నారు. ఆర్థిక ప్రయోజనాల కోసమే, మర్చంట్ బ్యాంకర్లు, బ్రోకర్ల సలహాతో జీహెచ్ఎంసీని మూడు భాగాలుగా విభజించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని, అసెంబ్లీలో చర్చిస్తామని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై స్పందిస్తూ, నిఘా వ్యవస్థలు నెహ్రూ కాలం నుంచి ఉన్నాయని, ప్రస్తుతం ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ కావడం లేదని సీఎం కచ్చితంగా చెప్పగలరా అని ప్రశ్నించారు. సిట్‌లు, విచారణల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లిస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల ఫలితాలే కాంగ్రెస్ పాలనపై ప్రజా తీర్పు అని, రెండేళ్లలోనే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించారని ఆయన వ్యాఖ్యానించారు.

# మరో చెరువుకు పునరుజ్జీవం

దీనిపై తక్షణమే స్పందించిన కమిషనర్ 'ఆపరేషన్ అంబీర్ చెరువు' పేరుతో భారీ ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టారు.

### సెలవుల్లోనూ కొనసాగిన ప్రక్షాళన పనులు..

సాధారణంగా ప్రభుత్వ పనులకు సెలవు రోజుల్లో విరామం ఉంటుంది. కానీ అంబీర్ చెరువు పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన హైడ్రా సిబ్బంది క్రిస్మస్, వారాంతపు సెలవుల్లో కూడా విశ్రాంతి లేకుండా పనిచేశారు. సుమారు 6 లారీలు, 3 జేసీబీల సాయంతో చెరువు గట్టున పేరుకుపోయిన చెత్తను తొలగించారు. శనివారం నాటికి దాదాపు 104 లారీల వ్యర్థాలను చెరువు పరిసరాల నుండి తరలించడం విశేషం. చెరువు మధ్యలో నుంచి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఇంకా గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను చూస్తుంటే మరో వంద లారీలకు పైగా వ్యర్థాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. చెరువు ప్రక్షాళన కేవలం చెత్తను తొలగించడంతోనే ముగిసిపోదు. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి పరిస్థితి రాకుండా హైడ్రా గట్టి చర్యలు తీసుకుంటోంది. మాంసం, చేపలు, చికెన్ వ్యర్థాలను చెరువులో పారబోస్తున్న నాలుగు వాహనాలను ఇప్పటికే హైడ్రా బృందాలు పట్టుకున్నాయి. చెరువును డస్ట్ బిన్‌లా వాడుతున్న వారిపై కఠినమైన జరిమానాలు విధిస్తున్నారు. చెరువు రోడ్డుపై వ్యాపారం చేసుకునే వారికి జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నిజాంపేట్, ప్రగతినగర్, కూకట్‌పల్లి ప్రాంతాల నుండి వచ్చే మురుగునీరు నేరుగా చెరువులోకి చేరకుండా ఎస్టీపీ (మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్లు) ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కేవలం వర్షపు నీరు మాత్రమే చెరువులోకి చేరేలా చూడటం ద్వారా చెరువు ఆవరణ వ్యవస్థను కాపాడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. చెత్త తొలగించిన తర్వాత చెరువు చుట్టూ ఇనుప కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేసి సుందరీకరణ పనులు చేపట్టాలని హైడ్రా భావిస్తోంది. ప్రగతినగర్ చెరువును మళ్లీ ఒక ఆహ్లాదకరమైన విడిది ప్రాంతంగా మార్చడానికి స్థానిక ప్రజలు కూడా అధికారులతో కలిసి పనిచేస్తున్నారు. చెరువుల సంరక్షణ అనేది కేవలం అధికారుల బాధ్యతే కాదని ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఈ ఆపరేషన్ నిరూపిస్తోంది. హైడ్రా తీసుకుంటున్న ఈ చొరవ వల్ల అంబీర్ చెరువు త్వరలోనే తన పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది.

# అన్ని ఆలయాల్లో 'శ్రీవారి సేవకులు' తరహా విధానం

దేవదాయ సహా పలు కీలక శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు ప్రజలకు ఎలా అందుతున్నాయనే దానిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో స్థానిక భక్తులతో వాలంటీర్లను నియమించుకోవాలి. భగవంతుడి సేవ చేసేందుకు చాలామంది ముందుకొస్తారు. అలాంటి వారిని ప్రోత్సహించి, వారి సేవలను వినియోగించుకోవాలి. ఇప్పటికే శ్రీశైలంలో ఈ విధానం కొనసాగుతోంది. ఇదే స్ఫూర్తితో అన్ని ఆలయాల్లో అమలు చేయాలి" అని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే రెవెన్యూ, వైద్యారోగ్య శాఖల పనితీరుపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. "ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, వేగంగా అందాలి. భూ సర్వేలు చేపట్టేటప్పుడు ప్రజలు ఇబ్బందులు పడకూడదు. ఈ విషయంలో రెవెన్యూ యంత్రాంగంపై ఉన్న చెడ్డపేరును తొలగించుకునేలా పనిచేయాలి" అని ఆయన దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు అన్నిచోట్లా పరిశుభ్రత పాటిస్తూ, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వైద్యులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మెరుగైన ప్రజారోగ్యం కోసం వ్యవసాయ, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "భూసార పరీక్షలు నిర్వహించి, ఎరువుల వాడకాన్ని తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏ పంటలు పండించాలో తెలియజేయాలి. దీనికోసం క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలిసి పనిచేయాలి" అని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని, మిల్లర్లు ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని రవాణా శాఖను ఆదేశించారు. అగ్నిమాపక శాఖ పనితీరు బాగుందని అభినందించారు. ఈ సమీక్షలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## యమునా నదిలో ఇసుకాసురులు

న్యూఢిల్లీ : యమునా నది వెంబడి అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డేలేకుండా పోయింది. ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాలైన ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లో యథేచ్ఛగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న తవ్వకాలపై దర్యాప్తు చేయాలని పిటిషన్లు దాఖలయ్యాయి. దీనికి ప్రతిస్పందనగా ఏర్పాటు చేసిన కమిటీ గుర్తించిన తీవ్రమైన పర్యావరణ ఉల్లంఘనలను జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) పరిగణనలోకి తీసుకుంది. మైనింగ్ శాఖ, కాలుష్య నియంత్రణ అధికారులతో కూడిన సంయుక్త కమిటీ ఈ నెల ప్రారంభంలో నివేదిక సమర్పించింది. లీజు తీసుకున్న ప్రాంతానికి భిన్నంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్లు నివేదికలో ప్రస్తావించింది. దేశ రాజధానిలో గాలి నాణ్యత క్షీణిస్తుండటాన్ని ఎదుర్కోవడానికి విధించిన నిబంధనలను ఉల్లంఘించడం వంటి అనేక సంఘటనలను వెల్లడించింది.

మైనింగ్, సంబంధిత కార్యకలాపాలను పూర్తిగా మూసివేయాలని ఆదేశించే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్ఏపీ) యొక్క దశ-3 అమలులో ఉన్న కాలంలో కూడా కంపెనీ మైనింగ్ కొనసాగించిందని ప్యానెల్ కనుగొంది. అలాగే, అనధికార ర్యాంప్‌ల నిర్మాణం , నదీగర్భంలో 15-20 అడుగుల లోతు వరకు తవ్వకాలను కూడా నివేదిక గుర్తించింది.

## ఎన్నికల ఫలితాలకతీతంగా మానవత్వాన్ని చాటిన ఎడపల్లి బాబు

**- బాధిత కుటుంబానికి పరామర్శ**

**- రూ.10 వేలు ఆర్థికసాయం అందజేత**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన బొడ్డు పర్శరాం ఆదివారం బావుపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన ఎడపల్లి బాబు ఆదివారం రాత్రి ఆసుపత్రికి వెళ్లి పర్శరాంను పరామర్శించారు. వైద్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకొని అనంతరం పర్శరాం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు నగదు ఆర్థికసాయం అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎడపల్లి బాబు మాట్లాడుతూ, "ఎన్నికల్లో గెలుపు - ఓటములు సహజం. కానీ గ్రామ ప్రజలతో ఉన్న అనుబంధం మాత్రం శాశ్వతం. ప్రమాదంలో గాయపడిన పర్శరాం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. అతని కుటుంబానికి నా వంతు సహాయంగా రూ.10 వేల నగదు ఆర్థిక సాయం అందిస్తున్నాను. గ్రామ ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా ఎప్పుడూ అండగా ఉంటాను" అని అన్నారు.బాబు చూపిన మానవతా దృక్పథానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## మెట్టుగూడలో స్పెషల్ శానిటేషన్ ప్రోగ్రాం



తార్నాక(ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ శానిటేషన్ ప్రోగ్రాం సోమవారం మెట్టుగూడ సర్కిల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ క్లీనింగ్ చేయడం జరిగింది. దీనికి గాను సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, మిగతా సిబ్బంది పాల్గొన్నారు. రేపు అన్ని ఫ్లై ఓవర్లులో స్పెషల్ శానిటేషన్ ప్రోగ్రామ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

## గౌడ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



నాగారం(ప్రశ్న న్యూస్) నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు సత్యనారాయణ కాలనీలో గౌడ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం అత్యంత ఘనంగా జరిగింది. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, గౌడ కుల బాంధవులు పాల్గొని ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గౌడ సోదరుల ఐక్యత కోసం, వారి సంక్షేమం కోసం తమ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. రాబోయే నూతన సంవత్సరంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అధ్యక్షులు జె. రామకృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. వరప్రసాద్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. ఉమా శంకర్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ ఆర్. నరసింహ గౌడ్, జాయింట్ సెక్రెటరీ పి. వెంకటేష్ గౌడ్,ముఖ్య అతిథిలుగా కోళ్ల ఈశ్వర ప్రసాద్ గౌడ్, సీహెచ్. సాయినాథ్ గౌడ్, ఆర్. శ్రీహరి గౌడ్, ఎస్. హరి గౌడ్, డాక్టర్ సత్య గౌడ్, వి. శ్రీనివాస్ గౌడ్ లు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం - టీఎల్ యువసేన సంకల్పం

**- యువత సేవా భావంతో ముందుకు రావాలి**

**- చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు ముందస్తు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు**

**- ప్రముఖ సామాజిక వేత్త,టీఎల్ యువసేన అధినేత : తూడి లచ్చన్న**



గంగాధర (ప్రశ్న న్యూస్) నూతన ఆంగ్ల సంవత్సరం 2026ను పురస్కరించుకొని ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కొత్త సంవత్సరం ప్రజల జీవితాల్లో ఆశావహ మార్పులు తీసుకురావాలి. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సమృద్ధి వెల్లివిరియాలి. యువత సామాజిక బాధ్యతను గుర్తించి సేవా కార్యక్రమాల్లో ముందుండాలి. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీఎల్ యువసేన నిరంతరం పనిచేస్తుంది. ప్రజల నమ్మకానికి తగిన విధంగా ఎల్లప్పుడూ మీతో పాటు ఉంటాం" అని అన్నారు.అంతేకాక 2026 సంవత్సరం చొప్పదండికి అభివృద్ధి పథంలో కొత్త దిశను చూపాలని, ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగాలని తూడి లచ్చన్న ఆకాంక్షించారు.

## ఆలేరును రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలి

**- ఎమ్మెల్యే అయిలయ్య**



**హైదరాబాద్** సోమవారం నాడు తెలంగాణ రాష్ట్ర లెజిస్లేటివ్ అసెంబ్లీలో ఆలేరు నియోజకవర్గ శాసనసభ్యులు మరియు రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆలేరు ప్రజల అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం మరియు సామాజిక సంక్షేమానికి సంబంధించిన కీలక అంశాలను ప్రస్తావిస్తూ మాట్లాడారు. అయిలయ్య మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గం విస్తీర్ణం పరంగా విశాలంగా ఉండడంతో పాటు, జనాభా పరంగా కూడా రాష్ట్రంలో పెద్ద నియోజకవర్గాల్లో ఒకటిగా ఉందన్నారు. గత 20 సంవత్సరాలుగా ఆలేరును రెవెన్యూ డివిజన్గా ఏర్పాటు చేయాలన్న డిమాండ్పై ప్రజలు, ప్రజా ప్రతినిధులు, సంఘాలు పునఃపునః పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. ప్రజల భావోద్వేగం, పరిపాలనా అవసరం దృష్ట్యా ఆలేరు నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్గా ప్రకటించాల్సిన సమయం ఆసన్నమైందని స్పీకర్ గారి దృష్టికి తీసుకువచ్చారు.విస్తారమైన గ్రామాల పరిధి కలిగి, జనాభా అధికంగా ఉన్న రఘునాథపురం ప్రాంతాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.
దూర ప్రాంతాల్లో ఉన్న కొన్ని గ్రామాలకు రేషన్ సౌకర్యం అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున, ఆ గ్రామాల్లో కొత్త రేషన్ షాపులు ఏర్పాటు చేయడం, లేక డీలర్ ఆధ్వర్యంలో పంపిణీ కేంద్రాలు ప్రారంభించడం వంటి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఆలేరు ప్రజల చిరకాల కోరిక అయిన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జరిగితే, అది ప్రజల అభివృద్ధి ప్రయాణానికి పెద్ద మైలురాయిగా నిలుస్తుంది. మా ఆలేరు వెనుకబడిన ప్రాంతాలను ముందుకు తీసుకువచ్చే బాధ్యతాయుత నిర్ణయంగా ఇది నిలుస్తుంది. ముఖ్యమంత్రి ఈ అభ్యర్థనను సానుకూలంగా పరిగణించి తక్షణ నిర్ణయం తీసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నానని అన్నారు

## కాలేజి ప్రిన్సిపాల్ పై దాడి

**పల్నాడు** నరసరావుపేట భావన కాలేజి ప్రిన్సిపాల్ మైనీడి శ్రీనివాసరావు పై దాడి జరిగింది. ఎస్ ఎస్ ఎన్ కాలేజీ గ్రౌండ్ లో ఉదయం వాకింగ్ చేస్తుండగా గుర్తి తెలియని వ్యక్తి కత్తితో దాడి చేసాడు. అయనను నరసరావుపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్తితి నిలకడగా ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. నిందితుడు ప్రస్తుతం వన్ టౌన్ పోలీసులు అదుపులో ఉన్నాడు.. గత సంవత్సరం క్రితం తన చెల్లి కాలేజీ భవనంపై సూసైడ్ చేసుకొని చనిపోయింది, అనంతరం తన తండ్రి కూడా మానసికంగా చనిపోవడంతో, కాలేజీ డైరెక్టర్ పై కక్ష పెంచుకొని చనిపోయిన విద్యార్థిని సోదరుడు ఏడుకొండలు ఈ ఘటనకి పాల్పడ్డాడని సమాచారం.

## న్యూ ఇయర్ వేడుకలపై
## పోలీసుల ఉక్కుపాదం

- **విజయవాడలో కఠిన ఆంక్షలు**
- **నగరంలోని అన్ని ఫ్లైఓవర్లను రాత్రిపూట మూసివేయనున్న పోలీసులు**
- **రోడ్లపై కేక్ కటింగ్‌లు, సంబరాలపై పూర్తిస్థాయి నిషేధంమద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**
- **బైక్ విన్యాసాలు, ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేక నిఘా**



కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో విజయవాడ నగరంలో పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు వెల్లడించారు. ఈ నెల 31 రాత్రి వేడుకల సందర్భంగా నగరంలోని బెంజ్ సర్కిల్, కనకదుర్గ ఫ్లైఓవర్‌తో సహా అన్ని ఫ్లైఓవర్లను మూసివేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ నిబంధన జనవరి 13వ తేదీ వరకు రాత్రి వేళల్లో అమలులో ఉంటుందని తెలిపారు.

నూతన సంవత్సర సంబరాల పేరుతో రోడ్లపైకి వచ్చి కేకులు కట్ చేయడం, బాణసంచా కాల్చడం, గుంపులుగా చేరి హడావుడి చేయడం వంటివి పూర్తిగా నిషేధించినట్లు సీపీ తెలిపారు. ముఖ్యంగా యువత అతివేగంగా వాహనాలు నడపడం, బైక్‌లపై ప్రమాదకర విన్యాసాలు చేయడం, సైలెన్సర్లు తీసి శబ్ద కాలుష్యం సృష్టించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని పట్టుకునేందుకు ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ట్రిపుల్ రైడింగ్ చేసే వారిపై కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి, కొత్త సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో తమ ఇళ్ల వద్దే జరుపుకోవాలని సీపీ రాజశేఖర్ బాబు సూచించారు.

## ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన

**హైదరాబాద్** హైదరాబాద్ కాచిగూడ లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం, బద్రివిశాల్ పిత్తి ట్రస్ట్, అగర్వాల్ సేవదళ్, శ్రీభగవాన్ మహవీర్ వికలాంగ్ సహాయత సమితి సంయుక్త అధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రక్త పరీక్షలు మధుమేహం ఈసీజీ గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ఆరోగ్యంగా ఉండడానికి డాక్టర్లు అనేక సలహాలు ఇచ్చారు. ఉచిత కంటి పరీక్షల నిర్వహించి కంటి అద్దాలు మరియు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.సమాజంలోని పేద ,మధ్యతరగతి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టుగా నిర్వాహకులు తెలిపారు.

## చైనా మాంజను పట్టిస్తే
## ఐదు వేలు గిఫ్ట్

**హైదరాబాద్** చైనా మాంజ పట్టిస్తే 5 వేలు గిఫ్ట్ ఇస్తానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రకటించారు. చైనా మాంజ కారణంగా మనుషులతో పాటు పక్షులకు ప్రమాదాలు సంభవిస్తున్నాయని దానం అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎవరైన చైనా మాంజను విక్రయిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. ఏ షాపులో అయిన చైనా మాంజ అమ్ముతున్నట్లు సమాచారం ఇస్తే , విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేయిస్తామన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని... వారికి తన నుండి 5 వేల నగదు బహుమతిగా ఇస్తానని దానం నాగేందర్ ప్రకటించారు.

## రాగ్యా నాయక్ వర్ధంతి

**సికింద్రాబాద్** ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద దేవరకొండ మాజీ ఎమ్మెల్యే ధీరావత్ రాగ్యా నాయక్ 24 వ వర్ధంతి కార్యక్రమాన్ని ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహులు నాయక్, ఓయూ జేఏసీ నాయకుడు కట్ట శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి మహబూబాబాద్ మాజీ ఎంపీ ధరావత్ రవీందర్ నాయక్ పాల్గొని రాగ్యా నాయక్ చిత్రపటానికి పూల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ రవీందర్ నాయక్, కట్ట శేఖర్ మాట్లాడుతూ ధీరావత్ రాగ్యా నాయక్ ఆశయాల కోసం నేటి యువత కృషి చేయాలని అన్నారు. ఏ సమస్య వచ్చిన ప్రజలకు అండగా ఉండే రాగ్యా నాయక్ కొడుకు స్కై లాబ్ నాయక్ కు రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా నామినేటెడ్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. అలాగే రాగ్యా నాయక్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు

## అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో
## రామగిరిలో ముందస్తు అరెస్టులు



**కమాన్ పూర్** అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సోమవారం తెల్లవారుజామున రామగిరి పోలీసులు పలువురు బీఆర్ఎస్ నాయకులు, ఆశా వర్కర్లను ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఈ సందర్భంగా ప్రజాస్వామ్యవాదులు ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణిచివేసేందుకు ముందస్తు అరెస్టులకు పాల్పడుతోందని తీవ్రంగా విమర్శించారు. ప్రజా ప్రతినిధులు, నాయకుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తీకరణకు హక్కు ఉందని, శాంతియుతంగా తమ డిమాండ్లు వినిపించాలనుకున్న నాయకులు, ఆశా వర్కర్లను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పలువురు నాయకులు వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ ముందస్తు అరెస్టులపై స్పందించిన పోలీసులు, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్త చర్యలుగా అరెస్టులు చేశామని స్పష్టం చేశారు.

## కోదాడ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో మహా మండల పూజా కార్యక్రమం



**సూర్యాపేట** చుకొని 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామికి అంగరంగ వైభవంగా అభిషేకాలు స్వామివారిని ప్రత్యేక అలంకరణతో పూజ కార్యక్రమాలు కమిటీ వారు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో సుమారు 4000 మంది పాల్గొన్నారు. సాయంత్రం కోలాట నృత్యాలతో కోదాడ పురవీధుల్లో స్వామి వారిని దర్శనార్థం ఊరేగించారు. అయ్యప్ప స్వాములకు హోమగుండం నిర్వహించారు. అయ్యప్ప స్వామి దేవాలయం పూజారి వివేక్, శివాలయం పూజారి దివాకర్ శర్మ ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ, దాతల సహకారంతో ప్రతి సంవత్సరం మండల పూజా నిర్వహిస్తామని, ఈ సంవత్సరం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున కోదాడ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చల్లా రామ్మూర్తి, సురభి నరసయ్య, బొలిశెట్టి కృష్ణయ్య, వెంకట్ నారాయణ, కొక్కి లక్ష్మీనారాయణ, వంకాయలపాటి నాగేశ్వరరావు (సుబ్బిశెట్టి), గడియారం శ్రీనివాస్ స్వామి, ఓరిగంటి శ్రీనివాస్ స్వామి, సత్యం స్వామి, రామనాథ స్వామి ,సైదులు స్వామి అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్‌ల మరమ్మతు చేయండి

**- ప్రజావాణి లో మున్సిపల్ కమిషనర్ కి కాంగ్రెస్ నాయకులు అనంతుల రమేష్ వినతి**



కరీంనగర్ నగర పలక సంస్త పరిది లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ లను మరమత్తు చేయాలనీ సోమవారం ప్రజావాణి లో నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కి అని కాంగ్రెస్ నాయకులు అనంతుల రమేష్ వినతి పత్రం అందచేసారు.ఈ సందర్భంగా కరీంనగర్ నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ ల నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్ దా లేక నగరపాలక సంస్థ దా పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 3.60 కోట్లతో నగరంలో పలుచోట్ల యుద్ధ ప్రాతిపాదికన 30 జిమ్ములు ఏర్పాటు చేసారని.. ఒక్కో ఓపెన్ జిమ్ కు 12 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసి వాటి నిర్వహణ మాత్రం గాలికి వదిలేశారని మండిపడ్డారు.. చలికాలం కావడంతో ఎక్కడ చూసినా ఓపెన్ జిమ్ లు కిటకిటలాడుతున్నాయని వ్యాయామం చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని... తీరా ఓపెన్ జిమ్ముల వద్ద పరికరాలు చెడిపోయి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే ఓపెన్ జిమ్ లు చెడిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. పేర్కొన్నారు.. ఎన్నిసార్లు నగరపాలక సంస్థ అధికారులకు నిర్వహణ విషయం తెలియజేసిన పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు.. ఓపెన్ జిమ్ లు గత పాలక వర్గం నగర ప్రజల ఆరోగ్యం కోసం పెట్టారా... కమిషన్ల కోసం పెట్టారా అర్థం కావడం లేదని పేర్కొన్నారు..

## నూతన సంవత్సరం
## ఆనందంగా మొదలవ్వాలి

**- నిర్లక్ష్యం వల్ల విషాదంగా మారకూడదు. - జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**
**- వేడుకల పేరుతో ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే ఉపేక్షించం.**
**- జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్త్, పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు.**



**జగిత్యాల టౌన్ :** ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం పక్కా కార్యాచరణతో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. పిల్లలు, పెద్దలు అందరూ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇండ్లలోనే నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఎస్పి సోమవారం విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం ఆనందంగా ప్రారంభం కావాలి గాని, నిర్లక్ష్యం వల్ల విషాదంగా మారకూడదని ఎస్పీ పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉండి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్‌తో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఎక్కడా నూతన సంవత్సర కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసుకునే కార్యక్రమాలు ప్రజ జీవనానికి భంగం కలిగించే విదంగా ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని,టపాసులు, మైకులు ఎక్కువ సౌండ్ పెట్టి ఎవరిని ఇబ్బంది పెట్టకూడదని, డీజే లు నిషేధమని, వినియోగిస్తే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని, మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరమని, వాహనాలు ఇష్టానుసారంగా వేగంగా నడిపితే కేసులు నమోదు చేయడంతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని, ఇల్లు, ప్రవేట్ ఆస్తులపై, వీధి దీపాల పై రాళ్లు వేయడం, అద్దాలను పగలగొట్టడం, మహిళలను ఇబ్బంది పెట్టిన, అసభ్యంగా ప్రవర్తిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, న్యూ ఇయర్ వేడుకలలో నిషేదిత డ్రగ్స్, గాంజా వంటి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలని, మైనర్లకు మద్యం అమ్మకూడదని, బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు పెడుతామని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని, వారి వల్ల ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే వారి సంరక్షకుల పైన కేసులు నమోదు చేస్తామని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా ఎర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయన సరే నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తూ అనుమతులు తీసుకోవాలని, పై అంక్షలను ఎవరైన అతిక్రమించిన, ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని, శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా పోలీస్ శాఖ కు జిల్లా ప్రజల సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు. 2026 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి కలగాలని ఆశిస్తూ, జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ తరపున జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## శాంతిభద్రతలలో భాగంగా గోదావరిఖని పరిధిలో కట్టుదిట్టమైన పోలీస్ నాకాబంది

**- అక్రమాలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు చెక్...**
**- ప్రజా రక్షణే లక్ష్యం : - పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి**
**- నూతన సంవత్సర వేడుకలకు డీజే లకు అనుమతి లేదు**



రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మంచిర్యాల డీసీపీ బి. రామ్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ పర్యవేక్షణ లో గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేన రెడ్డి, రవీందర్ ల ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని 5 ఇంక్లైన్, విటల్ నగర్, తిలక్ నగర్ డౌన్, తిలక్ నగర్, రమేష్ నగర్, చంద్ర శేఖర్ నగర్, సంతోష్ నగర్, ద్వారకా నగర్ ప్రాంతాలలో సీఐ-02,ఎస్ ఐ 12, సిబ్బంది-100 మంది తో ఒకేసారి నేర నియంత్రణ ముందస్తు చర్యలు భాగంగా నాకాబంది నిర్వహించి వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ వాహన తనిఖీల్లో పెద్దపెల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసిపి ఎం రమేష్ లు స్వయంగా పాల్గొని వాహన తనిఖీలు నిర్వహించడం జరిగింది. అక్రమ రవాణా,ప్రభుత్వ నిషేధిత పదార్థాలు రవాణా, అనుమానిత వ్యక్తుల కట్టడి, నేరాల నియంత్రణ, అవాంఛనీయ సంఘటనలను అరికట్టడానికి, నేరాలకు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులు, అనుమానితులు, దొంగిలించబడిన వస్తువులు, సరైన పత్రాలు లేని వాహనాలను పట్టుకోవడానికి, భాగంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా కార్యకలాపాలు జరగకుండా కట్టడి చేయడంతో పాటు, దొంగతనాలు,చైన్ స్నాచింగ్ లు వంటి ఇతర నేరాలను నివారించేందుకు ఈ తనిఖీలు నిర్వహించడం జరిగింది. నాకాబందీ సమయంలో అనుమానిత వ్యక్తులు మరియు అనుమానాస్పద వాహనాలను ఆపి సమగ్రంగా తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్,డ్రైవింగ్ లైసెన్స్,ఇన్సూరెన్స్, ఫిట్నెస్, పొల్యూషన్ వంటి ధ్రువ పత్రాలను పరిశీలించారు.డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్,ట్రిపుల్ రైడింగ్,మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేని వారు, వాహన ధ్రువ పత్రాలు లేని వారిపై పోలీస్ అధికారులు కేసులు నమోదు చేసి, 80 ద్విచక్ర వాహనాలు, 06 ఆటో లు, 03 కార్లు లకు జరిమానా విధించి వారికి రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా వాహనదారుల వివరాలు, వారు వెళ్లే ప్రదేశం వివరాలు, వాహనాలలో ఉన్న వారి వివరాలు తెలుసుకోవడం జరిగింది. శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధానికి సంబంధించి ఈ నాకాబంధి కార్యక్రమం నిర్వహించడం జరిగింది అన్ని డీసీపీ తెలిపారు.ఈ ప్రక్రియను నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా డిసెంబర్ 31 రోజు కూడా నిర్వహించడం జరుగుతుంది అని, 10 గంటల తరువాత స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని, నూతన సంవత్సర వేడుకలు వారి వారి కుటుంబ సభ్యులతో ఇంట్లో జరుపుకోవాలని, అనవసరంగా రోడ్లపైకి వచ్చి వాహనదారులకు ప్రజలకు ఇబ్బంది కలిగించే లాగా ప్రవర్తించడం చేస్తే చట్టబడమైన కఠిన చర్యలు తప్పవని యువత తాత్కాలిక ఆనందాల కోసం తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఇలాంటి తనిఖీలు మరింత కఠినంగా కొనసాగిస్తామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని డీసీపీ విజ్ఞప్తి చేశారు.

# కూచిపూడి నృత్యంలో..."కార్తీక" ప్రతిభ...!

## - గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో దక్కిన చోటు







**కమాన్ పూర్** హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 27న నిర్వహించిన కూచి పూడి నాట్య ప్రదర్శనలో కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన ఉద్దమారి శంకర్ – లావణ్య ల కుమార్తె "కార్తీక " పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించింది. కార్తీక గత కొంత కాలంగా కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రదర్శనలతో రాణిస్తుంది. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని మోడల్ స్కూల్ లో 7 వ తరగతి చదువుతుంది. అదే మందమర్రిలోని శ్రీసాయి నాట్య కళానిలయంలో కార్తీక మూడు సంవత్సరాల గా గురువు అశ్విని ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతుంది. ఈ నెల 27న హైదరాబాద్ లోని గచ్చి బౌలి స్టేడియంలో నిర్వహించిన సామూహిక కూచిపూడి నృత్య పోటీల్లో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్లో స్థానాన్ని సంపాదించింది. గిన్నిస్ బుక్ స్టానం సంపాదించడంతో పాటు, సర్టిఫికెట్ పతకాన్ని సాధించి కూచిపూడి నృ త్యంలో అద్భుత ప్రదర్శనతో మండలానికి వన్నె తెచ్చింది. గచ్చిబౌలి వేదికగా 7 వేల మంది చిన్నారులు ప్రదర్శించిన సామూహిక నృత్య పోటీల్లో కార్తీక ప్రతిభ చూపి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లను సొంతం చేసుకో వడం పట్ల తల్లిదండ్రులు శంకర్ – లావణ్య లు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం, కమాన్ పూర్ మండలంలోని ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు అభినందనలు తెలియజేశారు.

## డిసెంబరు 30న ముక్కోటి ఏకాదశి ఉత్సవం

**శ్రీశైలం** డిసెంబరు 30న ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక ఉత్సవం నిర్వహించబడుతుంది. ఈ ఉత్సవం సందర్భంగా వేకువజామున శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉత్తరద్వార దర్శనం, రావణవాహనసేవ నిర్వహించబడుతాయి. ఈ ఉత్సవంలో భాగంగానే ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండప ఉత్తరద్వారం నుండి వెలుపలకు తోడ్కొనివచ్చి ఆలయ ఉత్తరభాగంలో రావణవాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపించబడతాయి. ముక్కోటి ఏకాదశి రోజు ఉదయం గం. 3.00లకు ఆలయద్వారాలను తెరచి మంగళ వాయిద్యాల అనంతరం గం. 3.30ని!!లకు స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించబడుతుంది. తరువాత శ్రీ స్వామిఅమ్మవార్లకు ప్రాత:కాలపూజలు జరిపించి గం. 4.30 ని!!లకు స్వామివారికి, తరువాత అమ్మవారికి మహామంగళహారతులు జరిపించబడతాయి. అనంతరం ఉదయం 5. 30నిలకు రావణవాహనసేవ జరిపించబడుతుంది. ఆ తరువాత శ్రీస్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించబడుతుంది. శ్రీ స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం తదుపరి ఉదయం గం. 6.00ల తరువాత దర్శనాలు, ఆర్జితసేవలు ప్రారంభమవుతాయి.

### మంత్రి శ్రీధర్ బాబు సహకారానికి

## రుణపడి ఉంటాం

### - చిన్న ఓదాలకు నిధుల మంజూరు పట్ల మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం

**మంథని** చిన్న ఓదాల గ్రామంలో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారానికి రుణపడి ఉంటామని గ్రామ సర్పంచ్ నాగుల శారద రాజయ్య అన్నారు. సోమవారం మంథని మండలం చిన్న ఓదాల గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగుల శారద రాజయ్య మాట్లాడుతూ మా ఊరి బస్టాండ్ నుండి మానేరు వరకు రహదారి నిర్మాణానికి కోటి రూపాయలు నిధులు మంజూరు చేయించినందుకు మంత్రి శ్రీధర్ బాబుకు గ్రామ ప్రజలందరి తరఫున గ్రామపంచాయతీ పాలకవర్గం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగుల రాజయ్య,వార్డు సభ్యులు దువాసి సదయ్య, ముత్యాల లక్ష్మమ్మ, మంథని రాజేశం,నాయకులు ముత్యాల చెందు, ముత్యాల రాజేశం,గెల్లే మల్లయ్య,సిద్ధి శ్రీను,లింగాల మల్లేష్,గువ్వల మల్లేష్,మూడెత్తుల చంద్రయ్య,లింగాల నరేష్,సిహెచ్ గణపతి,మూడెత్తుల విజయ్,జంజర్ల మొగిలి లతో పాటు గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి కి ఏర్పాట్లు పూర్తి

**హైదరాబాద్** జూబ్లీహిల్స్ లోని టిటిడి దేవాలయంలో వైకుంఠ ఎకాదశికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టిటిడి జూబ్లీహిల్స్ లోకల్ అడ్వైజ్ కమిటీ ఛైర్మన్ ఎ. వెంకటేశ్వర్రెడ్డి తెలిపారు. టిటిడి దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తెల్లవారుజామున 1.30 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు భక్తులకు ఉత్తరద్వార దర్శనం ద్వారా దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు పండ్లరసాలు, మజ్జిగ, బాదంపాలు ఉచితంగా అందిస్తామన్నారు.?

## హాస్టల్ విద్యార్థులతో వంటలు : జిల్లా కలెక్టర్ ఫైర్

**ఒంగోలు** ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం లోని వసతి గృహం విద్యార్థినిలతో కలెక్టర్ రాజాబాబు ఫోన్లో మాట్లాడారు. వసతి గృహంలో వంటలను విద్యార్థుల చేత చేయిస్తున్న విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. స్పందించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాస్టల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీలా ముందు ఎమ్మెల్యే కలెక్టరు కి ఫోన్ కాల్ చేసి స్వయంగా మాట్లాడించారు. వారిపై తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు.

### ఎర్నాకుళనీ ఎక్స్ ప్రెస్ అగ్నిప్రమాదంపై

## స్పందించిన హోం మంత్రి అనిత

**అనకాపల్లి** ఎర్నాకుళనీ ఎక్స్ ప్రెస్ అగ్నిప్రమాదంపై హోం మంత్రి అనిత స్పందించారు. మంత్రి అధికారులతో ఫోన్లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఎప్పటికప్పుడు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో ఒకరు చనిపోవడం బాధాకరం. గాయాలు అయిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఘటన లో చనిపోయిన వ్యక్తి విజయవాడకు చెందిన సుందర్ (70) గా గుర్తించారు.

### అర్జీలను స్వీకరించిన

## ఆదిలాబాద్ కలెక్టర్

**ఆదిలాబాద్,** సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్ కూడా పాల్గొన్నారు. ప్రజల సమస్యలను ఆలకించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ఓసిలకు ప్రత్యేక జాతీయ కమిషన్ ఏర్పాటు చేయాలి

### - ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు
### - ఓసి ల సింహ గర్జన సభను విజయవంతం చేయాలి - రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నం కిషన్ రెడ్డి పిలుపు



**జగిత్యాల** ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పటిష్ట అమలుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలని ఓసి ఐకాస నాయకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జనవరి 11నవరంగల్ లోలక్ష మందితో నిర్వహించ తలపెట్టిన ఓసి ల సింహగర్జన సభ ఏర్పాట్లపై సోమవారం జగిత్యాల లోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన జగిత్యాల జిల్లా స్థాయి ఓసి ఐకాస నాయకుల సన్నాహక సమావేశంలో రెడ్డి, వెలమ, వైశ్య, బ్రాహ్మణ సామాజిక వర్గాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓసి సామాజిక సంక్షేమ సంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావుతో పాటు ఐకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నం కిషన్ రెడ్డి, చీటి శిరీష రావు, ఐకాస నాయకులు అయిల్నేని సాగర్ రావు, మహంకాళి రాజన్న, సిరిసిల్ల శ్రీనివాస్, పుల్లూరి సత్యనారాయణ, సిరిసిల్ల రాజేందర్ శర్మ, చీటి శ్రీనివాస్ రావు లు మాట్లాడారు జాతీయ అధ్యక్షులు రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ... ఈడబ్లూఎస్ సర్టిఫికెట్ జారీకి షరతులు లేని 5 ఏళ్ల కాలపరిమితి కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు విద్యా, ఉద్యోగ పోటీ పరీక్షల వయోపరిమితి పెంచాలని, ఈడబ్లూఎస్ వారికి కేటాయించిన మిగిలి పోయిన బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీకి వార్షిక ఆదాయ పరిమితి 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. టెట్ రాత పరీక్ష అర్హతకు 90 మార్కుల నుంచి 70 మార్కులకు తగ్గించాలని ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని కోరారు. తమ డిమాండ్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్ళేందు కోసం జనవరి 11 న సాయంత్రం 3 గంటలకు హన్మకొండ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్ లో లక్ష మందితో నిర్వహించే రాష్ట్ర స్థాయి "ఓసి ల సింహగర్జన" భారీ బహిరంగ సభకు ఓసి లంతా రాజకీయాల కతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఐకాస జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా సింహగర్జన బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఐకాస నాయకులు ఆవిష్కరించారు. ఈసమావేశంలో నాయకులు మోతే ఉమాపతి శర్మ, వెంకటేశ్వర్ రావు,దేవరశెట్టి జనార్దన్, బద్ధం నారాయణ రెడ్డి, మందల గోపాల్ రెడ్డి, నవీన్ రెడ్డి,నాగిశెట్టి అపర్ణ, అయిల్నేని స్వప్న, పురుషోత్తం రావు, సందీప్ రావు, సిరిసిల్ల వేణుగోపాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### డా.ఆకుల శ్రీనివాస్ మృతి

## వైద్య శాఖకు తీరని లోటుడి

### ఎం.హెచ్. వో డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఆకస్మిక మృతి పట్ల సంతాపం




**జగిత్యాల,** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆకుల శ్రీనివాస్ మృతి వైద్య, ఆరోగ్య శాఖ కు తీరని లోటని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆన్నారు. సోమవారంజగిత్యాల జిల్లా ఐ డి ఓ సి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇటీవల హఠాన్మరణం చెందిన జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆకుల శ్రీనివాస్ మృతి పై తీవ్ర సంతాపం వెలిబుచ్చారు. జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ బి. సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్లు బిఎస్ లత, బి రాజా గౌడ్, ట్రైని డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి,వివిధ శాఖల జిల్లా అధికారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ఆకుల శ్రీనివాస్ గారి మరణం వైద్య ఆరోగ్యశాఖ కు తీరని లోటని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచుల అసెంబ్లీ ముట్టడి

**హైదరాబాద్** పెండింగ్ బిల్స్ విడుదల చేయాలంటూ మాజీ సర్పంచులు తెలంగాణ అసెంబ్లీ ముందు ఆందోళనకు దిగారు. అసెంబ్లీని ముట్టడించిన మాజీ సర్పంచ్లను పోలీసులు అరెస్ట్ చేసారు. మాజీ సర్పంచ్లకు రూ. 531 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించలేదని వారు ఆరోపించారు.

### అతి వేగంగా కార్ ఢీకొట్టడంతో

## వృద్ధురాలికి తీవ్ర గాయాలు

**మేడ్చల్** పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధి అన్నోజిగూడ ఎస్ బి ఐ బ్యాంక్ ఎదురుగా అతివేగంతో కార్ ఢీకొట్టడంతో మృదురాలకి తీవ్ర గాయాలు అయ్యాయి. హైదరాబాదు నుండి వరంగల్ కి వెళ్తున్న కార్ అతివేగంతో అన్నోజిగూడ ఎస్ బి ఐ బ్యాంక్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా వృద్ధురాలి ఢీకొట్టడంతో కాలు విరిగింది. 108 సాయంతో వృద్ధురాలని ఆస్పత్రికి తరలించారు. కార్ డ్రైవర్ ని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

## కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

**రంగా రెడ్డి** రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ వాసుదేవ రెడ్డి కాలనీలో మూడు సంవత్సరాల నిత్యశ్రీ అనే పాపపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీధి కుక్కలు పాపపై విచక్షణ రహితంగా దాడి చేయడంతో పాప మొహం పై 18 కుట్లు పడ్డాయి. వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తూ స్థానిక ప్రజలపై దాడి చేస్తున్న ఘటనపై ఆన్లైన్ లో స్థానికులు జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోకపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## రేణుకా చౌదరిని కలిసిన గురిజాల గోపి

### - పినపాక రాజకీయాలపై విస్తృత చర్చ

**భద్రాద్రి కొత్తగూడెం** మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గురిజాల గోపి సోమవారం మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ పార్టీ ఫైర్ బ్రాండ్ నేత రేణుకా చౌదరిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై ఆమెతో విస్తృతంగా చర్చించారు. ప్రాంతంలోని పార్టీ పరిస్థితులు, కార్యకర్తల సమస్యలు, ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవనంలో గురిజాల గోపి చేసిన సేవలను రేణుకా చౌదరి గుర్తు చేసుకుంటూ, ఆయన పాత్ర కీలకమని పేర్కొన్నారు. పినపాక నియోజకవర్గంలో పార్టీ పునాదులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపే కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పెరిగేలా ముందుకు సాగాలని సూచించారు. గురిజాల గోపికి తగిన గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడిన రేణుకా చౌదరి, ఆయనకు సముచిత బాధ్యత కల్పించేందుకు జాతీయస్థాయి నాయకులతో చర్చిస్తానని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రోటోకాల్ కలిగిన మంచి బాధ్యత ఇవ్వడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడే నాయకులను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్న ఆమె, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుపై ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ భేటీ సానుకూల వాతావరణంలో కొనసాగగా, రాబోయే రోజుల్లో పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకలాపాలు మరింత వేగం పుంజుకుంటాయని ఆశాభావం వ్యక్తమైంది. ఈ సమావేశం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది.

## సోయా రైతుల వింత నిరసన

**అదిలాబాద్** సొయా పంటను ప్రభుత్వానికి అమ్మడానికి మార్కెట్కు తీసుకురావడం మేము చేసిన తప్పని రైతులు ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని మార్కెట్లో ప్రభుత్వం నెల రోజుల నుండి తమ పంట కొనుగోలు చేయడం లేదని, మోకాళ్లపై కూర్చుని బుద్ధి లేక పంట పండించామని రైతులు నిరసన వ్యక్తం చేసారు.

## అన్నిదానాల్లో కెల్ల అన్నదానం మిన్న

- దాతల సహకారంతో 1712 రోజులుగా పేదలకు అన్నదాన కార్యక్రమం
- అన్నార్తుల పేదల అన్నదానానికి సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలియ జేసిన మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు
- అన్నపూర్ణే! సదాపూర్ణే! శంకర ప్రాణ వల్లభే! జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహీ చ పార్వతి



**వేములవాడ** ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1712 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున దాతలు అందించిన సహకారంతో లక్ష్మి గణపతి,రాజన్న భీమేశ్వర ఆలయం వద్ద పేదలకు మరియు అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా సోమవారం సందర్భంగా పేదలకు అన్నదానం చేయాలన్న సంకల్పంతో గత 3 సంవత్సరాలుగా అన్నదానానికి ప్రతీ సోమవారం సహకారం అందిస్తున్న జగిత్యాల వాస్తవ్యులు నల్ల వసంత సతీష్ దంపతులు,పుట్టినరోజు సందర్భంగా చౌటి రాజేశ్వర్ శర్మ శ్రావ్య దంపతులు మరియు కుటుంబ సభ్యులు శాశ్వత దాతలుగా డాక్టర్ జువ్వాడి వెంక టేశ్వరరావు స్నేహాలత దంపతులు ప్రతాప స్వప్న సంపత్ దంపతులు నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు,దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు రామడుగు శ్రీలత,కొడుకులు కోడళ్లు ప్రజ్ఞ శరత్చంద్ర దంపతులు,శిరీష సాయిచంద్ర దంపతులు,శర్వాణి రవిచంద్ర దంపతులు హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష సాయికృష్ణ ఉన్నారని మీయొక్క పుట్టినరోజు,పెళ్ళిరోజు మరియు ఇతరత్ర కార్యక్రమాలకు పేదలకు అన్నార్తులకు ఒక్కపూటైనా భోజనం అందించడానికి సహకారం అందించే దాతలు ట్రస్టు సభ్యులను గాని 92469 39388 నంబరుకు సంప్రదించాలని,ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్ తోట రాజు సగ్గు రాహుల్ పసుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో జగిత్యాల నియోజకవర్గ సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**జగిత్యాల** రాష్ట్ర అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో జగిత్యాల నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సభ సమీక్ష లో ప్రస్తావించారు.. జగిత్యాల మున్సిపాలిటీ పురాతనమైనదని, పట్టణ అభివృద్ధిలో భాగంగా యావర్ రోడ్డును 60 అడుగుల నుంచి 100 అడుగుల వరకు విస్తరించేందుకు 2021లో మాస్టర్ ప్లాన్ రూపొందించామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి మున్సిపల్ శాఖను కూడా నిర్వహిస్తున్నందున, యావర్ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సభాధ్యక్షుల ద్వారా విజ్ఞప్తి చేశారు. అలాగే జగిత్యాల ప్రాంతం ప్రధానంగా కమాండ్ ఏరియాగా ఉండటంతో సాగునీటి సమస్యలు తలెత్తకుండా కాలువల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని వివరించారు. మరోవైపు ధర్మపురి నియోజకవర్గానికి సంబంధించిన రోల్లవాగు ప్రాజెక్ట్ అటవీ అనుమతుల ఆలస్యం కారణంగా గేట్ల నిర్మాణం నిలిచిపోయిందని తెలిపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సభలో ఎమ్మెల్యే కోరారు

## వేములవాడ- కరీంనగర్ బస్సు సౌకర్యం పునరుద్ధరణకు వినతి - హామీ

**- సర్పంచుల హర్షం - కృతజ్ఞతలు**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** వేములవాడ-కరీంనగర్ మధ్య బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరుతూ మల్కాపూర్,తిప్పాయిపల్లి, మల్లాపూర్,గోపాల్‌రావుపల్లి గ్రామాల సర్పంచులు సోమవారం వేములవాడ డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ, వేములవాడ నుంచి వయా తిప్పాయిపల్లి, మల్కాపూర్, మల్లాపూర్, గంగాధర మీదుగా కరీంనగర్‌కు బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. దీనిపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి, త్వరలోనే బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.ఈ నిర్ణయంతో ఆయా గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుందని, గ్రామాల పక్షాన డిపో మేనేజర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని సర్పంచులు తెలిపారు.

## వేములవాడలో దోమల నియంత్రణపై జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేత

**- దోమల నివారణలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం**

**- భాజపా లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ : రేగుల రాజ్ కుమార్**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా వినతిపత్రం సమర్పించారు. వేములవాడ పట్టణ ప్రజల తరఫున ఈ వినతిని భారతీయ జనతా పార్టీ లీగల్ సెల్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్,ప్రముఖ న్యాయవాది రేగుల రాజ్ కుమార్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేములవాడ పట్టణంలో దోమల బెడద రోజురోజుకు పెరుగుతోందన్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్, పురుగు మందుల పిచికారీ చేపట్టాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేకపోవడం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.దోమల వల్ల డెంగ్యూ,మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున,నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకొని,వేములవాడ పట్టణవ్యాప్తంగా తక్షణమే ఫాగింగ్ కార్యక్రమాలు, డ్రెయిన్ల శుభ్రత,నిల్వ నీటి తొలగింపు వంటి చర్యలు చేపట్టాలని ప్రజావాణి వినతిపత్రంలో కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

## పశుపాలకుల ఆదాయవృద్ధికై ఆరోగ్య సంరక్షణ కీలకం

**- మాన్వాడ గ్రామ సర్పంచ్ : కట్ట గోవర్ధన్ గౌడ్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, మాన్వాడ గ్రామంలో సోమవారం గొర్రెలు,మేకలలో నట్టల నివారణకు మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్ట గోవర్ధన్ గౌడ్,వెటర్నరీ అధికారి మధుమిత రెడ్డి, వార్డు మెంబర్ మద్దూరి విష్ణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ కట్ట గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ, “గొర్రెలు, మేకల ఆరోగ్యం కాపాడితేనే పశుపాలకుల జీవనోపాధి బలపడుతుందని” అన్నారు. నట్టల నివారణ మందులు క్రమం తప్పకుండా వేయడం వల్ల జంతువుల ఆరోగ్యం మెరుగుపడి ఉత్పాదకత పెరుగుతుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పశు సంరక్షణ కార్యక్రమాలను రైతులు పూర్తిగా వినియోగించుకోవాలని, గ్రామంలో పశువుల ఆరోగ్య పరిరక్షణకు పంచాయతీ తరఫున నిరంతరం సహకారం అందిస్తామని తెలిపారు.

## మంథని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

**- విద్యార్థులను అభినందించిన ప్రధానోపాధ్యాయురాలు.**



**మంథని (ప్రశ్న న్యూస్)** మంథని మండల పరిధిలోని ఈనెల 26 నుండి 28 వరకు కరీంనగర్ లోని పారామిత హై స్కూల్ లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన చెకుముకి సైన్స్ సంబరాలలో మంథని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ విద్యార్థులను పాఠశాల ప్రదానోపాధ్యురాలు సుమలత, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రం లోని 33 జిల్లాల నుండి వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమంలో వివిధ అంశాలలో నిర్వహించిన పోటీలలో మంథని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు విక్రాంత్ 10వ తరగతి మణి చరణ్ 9వ తరగతి సుశృత 8వ తరగతి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు సయుక్త సూక్ష్మ దర్శిని బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుమలత, దొంతుల కుమార్, కొమరోజు శ్రీనివాస్, పోచయ్య , భరత్ రెడ్డి, బిరుదు మధు, రమేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఓటు అనేది లేకుంటే రాజకీయ నాయకుల భవిష్యత్తు ఎక్కడ.?

**- గ్రామపంచాయతీ ఎన్నికలలో అసలు ఏం జరిగింది.? - ఓట్లను నోట్లకు అమ్ముకోవడమే ప్రజాస్వామ్యమా?**

**- అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన వజ్రాయుధమే ఓటు .**

**- కుల, వర్ణ, వర్గ ,వివక్షత, ప్రాంతీయ తత్వాల మీద వైషమ్యాలు సృష్టించి ఒక జాతిని, నీతిని నిర్మించలేము.**




**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథనినియోజకవర్గంలోని 10 మండలాలలో సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే 65% అధికార పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థులు గెలుపొందారు. మంథని నియోజకవర్గంలో గత 30 సంవత్సరాల నుండి పార్టీకి అంకితభావంతో పనిచేసే మంథని నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీని సీనియర్ కార్యకర్తలు అభివృద్ధి పథంలో నడిపిస్తే ప్రతి గ్రామంలో సీనియర్లను కాదని పార్టీలు మారే ముక్కు ముఖం తెలియని కొత్తవారికి సర్పంచ్ టిక్కెట్లు ఇస్తే గ్రామాలలో డబ్బు మద్యం విచ్చలవిడిగా ఏరులై పారి ఓట్లను నోట్లకు అమ్ముకునీ సీనియర్ల ఆశల ఆడియ ఆశలు చేసి 65% మంథని నియోజకవర్గం లో గ్రామపంచాయతీ సర్పంచులు గెలుపొందారని సంకలు గుద్దుకుంటున్న మంథని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందొచ్చే గుడ్డు కంటే . వెనకచ్చే కోడి మిన్న అనే సందంగా మంథని నియోజక వర్గ లో సీనియర్ల వ్యవహార శైలి చూస్తే ప్రజలు బిత్తర పోతున్నారు. భారత రాజ్యాంగా విలువలను తుంగలో తొక్కే విధంగా గ్రామాలలో ఉన్న అభ్యర్థులు సేవ చేయడానికి నీతి నిజాయితీనీ పాత రేసి ఓట్లను కూరగాయల మార్కెట్లో అమ్మిన సందంగా ఓట్లను కొనుక్కొని ప్రజలకు సేవ చేసేది దేవుడు ఎరుగు అనే సందంగా వ్యవహరించిన విధానాన్ని ప్రజలు రాబోయే భవిష్యత్ ఎన్నికలలో తిలోదకాలు ఇస్తారన్న విషయాన్ని మర్చిపోకూడదు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ఇచ్చిన వజ్రాయుధమైన ఓటును గత పాలకులు ఓటు అమ్ముకొని అమ్ముకొని ప్రజలకు మద్యం డబ్బును ఎరచూపి వాళ్ళ భవిష్యత్తు మీద దెబ్బ కొట్టి ఓట్లను దండుకున్నారు. గ్రామాలలో శుభం, అశుభం తెలియని ప్రజలను నీతికి, నిజాయితీకి త్రిలోదకాలు ఇచ్చి మంచి సేవ చేసే నాయకున్ని ఎన్నుకొనకుండా అర్థ బలము, అంగబలం, అండ బలము ఉన్న సీనియర్ నాయకులు మద్దతు పలికి ముక్కు ముఖం తెలియని అభ్యర్థులను గెలిపించడం ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కినట్టే. మంత్రి సందర్శనకు వస్తే మాయమాటలు చెప్పే నాయకులే ఎక్కువగా ఉంటారు మరి సామాన్యుని కష్టాన్ని చెప్పుకునేది మంత్రికి ఎప్పుడు ఎలా అని ఆలోచన చేస్తున్నారు. సామాన్య ప్రజలు ఇకనుండి అయినా మీ చుట్టూ ఉండే నాయకులను పక్కనపెట్టి మీకు ఓట్లు వేసినా సామాన్య ప్రజల కష్టాలను అర్థం చేసుకొని వారి పనులను చేయాలని ప్రజలు ఆవేదనతో వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యానికి ప్రజలే పట్టుకొమ్మలని బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి భారత ప్రజలమైన మేము మాకు మేమే రాజ్యాంగాన్ని సమర్పించుకుంటున్నాము అనే పెద్ద గ్రంధాన్ని రాజ్యాంగాన్ని భారతదేశానికి అందిస్తే రాజకీయ నాయకులు విభజించు పాలించు అనే సందంగా గ్రామాలలో కులాల మధ్య వర్గాల మధ్య వైశ్యామ్యాలు సృష్టించి పడగలెత్తుతున్నారు. ఓ భారత రాజ్యాంగమా ప్రజాస్వామ్యమా ఈ నాయకులు మారే తీరు ఎప్పుడు అని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. మా ఓటు విలువ తెలుసుకునేది ఎన్నడు అని ప్రజలు నివ్వరపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనంటే నూటికి 65% గ్రామపంచాయతీలు ఎన్నికలేనా మిగిలిన 35% ఎన్నికలు కావా? ప్రజాస్వామ్య రక్షణకు స్వయం ప్రతిపత్తి గల సంస్థలు ప్రకడ్బందీగా పనిచేయనంతవరకు ప్రజలకు మాయమాటలు చెప్పి ఇలానే మోసం చేస్తారు. ఇకనుండి అయినా ఈ రాజకీయ నాయకుల రంగులను ప్రజలు అర్థం చేసుకొని రాబోయే ఎలక్షన్లో ఓటు ద్వారా వీళ్ళకు బుద్ధి చెప్పితేనే అర్థం చేసుకుంటారని ప్రజలు నమ్ముతున్నారు.

# ముక్కోటి ఏకాదశి నాడు ఉపవాస దీక్షతో లక్ష్మీనారాయణుని పూజిస్తే మోక్షం సిద్ధిస్తుంది

**- మూడు కోట్ల దేవతలు భూమికి దిగివచ్చే పుణ్యదినమే ముక్కోటి ఏకాదశి**



శ్రీ మహావిష్ణు భగవానుడు గరుడ వాహనుడై ముక్కోటి దేవతలతో కలిసి భూమిపైకి వచ్చే పుణ్యదినమే ముక్కోటి ఏకాదశి. ఒక ఏడాది కాలంలో 24 ఏకాదశులు వస్తాయి. అన్ని ఏకాదశులు విశిష్టమైనవే అయినప్పటికీ ముక్కోటి ఏకాదశి, తొలి ఏకాదశి, చిలుక ఏకాదశి ఎంతో విశేషమైనవి. ముక్కోటి ఏకాదశి సాధారణంగా మార్గశిర మాసంలో లేదా పుష్య మాసంలో వస్తుంది. సూర్యుడు ధనస్సు రాశిలోకి ప్రవేశించాక ధనుర్మాసం ఏర్పడుతుంది. ఈ ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా జరుపుకోవాలని శాస్త్రాల్లో వివరించారు. ముక్కోటి ఏకాదశి రోజు మూడు కోట్ల దేవతలు భూమిపైకి వస్తారని శాస్త్రవచనం.

### మోక్షదా ఏకాదశి

చింతామణిలా దేవదేవుడు భక్తుల సమస్త కోర్కెలను తీర్చి మోక్షాన్ని ప్రసాదించే ఏకాదశి కాబట్టి దీనిని మోక్షదా ఏకాదశి అని అంటారు. శ్రీ మహావిష్ణువు గరుడ వాహనంపై ముక్కోటి దేవతలకు, భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిస్తాడు కాబట్టి ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చిందని అష్టాదశ పురాణాలు వివరిస్తున్నాయి. ధనుర్మాసం వేళ ఆధ్యాత్మిక వైభవాన్ని రెట్టింపు చేసే పర్వదినం ఈ ముక్కోటి ఏకాదశి. ఈ పర్వదినం రోజు ప్రతి ఒక్కరు బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేచి నదీస్నానం చేయడం సర్వోత్తమమని శాస్త్రాలు చెబుతున్నాయి. నదీస్నానం వీలుకాని వారు స్నానం చేసే నీటిలో గంగాజలాన్ని కలుపుకుని స్నానం చేయవచ్చు. అది కూడా వీలు కాని వారు స్నానం చేసే నీటిలో సమస్త పుణ్య నదులను ఆవాహన చేసుకుని స్నానం చేయడం వలన నదీ స్నానం చేసిన పుణ్య ఫలం దక్కుతుంది.

### ప్రత్యేక పూజలు

ఈ రోజు బ్రహ్మ ముహూర్తంలో ఇంట్లోని పూజామందిరాన్ని శుభ్రం చేసుకుని ఆవునేతితో దీపారాధన చేయాలి. లక్ష్మీ నారాయణులను తులసిమాలలతో, గంధ పుష్పాలతో అలంకరించి షోడశోపచార పూజలు చేయాలి. శ్రీ మహా విష్ణువుకు ప్రీతికరమైన చక్రపొంగలి నివేదించాలి. అనంతరం బ్రహ్మ ముహూర్తం పూర్తయ్యేలోపు వైష్ణవాలయానికి వెళ్లి ఉత్తర ద్వారం నుంచి శ్రీమన్నారాయణుని దర్శించుకోవాలి. ఈ రోజు నారాయణుని ఉత్తర ద్వారం దర్శించుకుంటే ఆయన అనుగ్రహంతో పాటు సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ముక్కోటి ఏకాదశి రోజు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేయడం మోక్ష కారకమని బ్రహ్మాండ పురాణం వివరిస్తోంది.

### ఉపవాసం విశిష్టత


ముక్కోటి ఏకాదశి రోజు ఎవరైతే ఉపవాసం చేస్తారో వారికి విష్ణు భగవానుని అనుగ్రహంతో సకల విజయాలు కలుగుతాయని విశ్వాసం. ఏకాదశి రోజు అన్నం, పప్పుధాన్యాలు తీసుకోవడం నిషిద్ధమని ఏకాదశి వ్రత మహత్యంలో వివరించి ఉంది. అందుకే ఈరోజు పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం చంద్రోదయానికి పూర్వమే పండ్లు, పాలు వంటి సాత్విక ఆహారం తీసుకుంటే ఏకాదశి వ్రత ఫలం సంపూర్ణంగా దక్కుతుందని విశ్వాసం.

### జాగారం

ముక్కోటి ఏకాదశి రోజు రాత్రి భగవంతుని కీర్తనలు పాడుతూ భజనలు, భాగవత కథా చర్చలతో జాగరణ చేయాలి. జాగారం అనే పదానికి జాగరూకతతో ఉండటం అని అర్థం. ఏడాదికోసారి భగవంతుని సేవలో మోక్షార్థులై మేలుకొని ఉండడాన్ని జాగరణ అంటారు. ముక్కోటి ఏకాదశి రోజు జాగరణ చేసిన వారికి మూడు కోట్ల జన్మల పాపాలు పోతాయని విష్ణు పురాణం చెబుతోంది.

### ఏకాదశి అంతరార్థం

ఏకాదశి అంటే 11. ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, మనసును కలిపి మొత్తం ఈ పదకొండు ను ఏకాదశి ఉపవాసం రోజు అదుపులో ఉంచుకుని వాటిపై నియంత్రణ సాధిస్తూ ఏకాదశి దీక్ష చేయడమే ఏకాదశి వ్రతం అంతరార్థం. ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం, అమృతం రెండూ పుట్టాయి. ఈ రోజునే శివుడు హాలాహలం మింగాడని, మహాభారత యుద్ధంలో భగవద్గీతను కృష్ణుడు అర్జునునికి ఇదే రోజున ఉపదేశించాడని భక్తుల విశ్వాసం. ఈ రోజున వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు, ప్రసంగాల వంటి. కార్యక్రమాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా ఈ రోజు ఉపవాసం, జాగరణ. జపం, ధ్యానం వంటివి ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.విష్ణుపురాణం ప్రకారం ఇద్దరు రాక్షసులు తనకు వ్యతిరేకంగా ఉన్న వారి కోసం విష్ణు భగవానుడు తన వైకుంఠ ద్వారాలను తెరిచాడనీ, తమ కథ విని, వైకుంఠ ద్వారం గుండా వస్తున్న విష్ణు స్వరూపాన్ని చూసిన వారికి వైకుంఠం ప్రవేశం కల్పించాలనీ వారు కోరారు. అందుజేతనే ఆ రోజును వైకుంఠ ద్వారాన్ని తలపించే విధంగా వైష్ణవ ఆలయాల్లో ద్వారాలను ఏర్పాటు చేస్తారు. మామూలు రోజుల్లో దేవాలయాల ఉత్తర ద్వారాలు మూసి ఉంచుతారు. కానీ ఈ రోజు భక్తులు ఆ ఉత్తరద్వారం గుండా వెళ్ళి దర్శనం చేసుకొంటారు. తిరుపతిలో కూడా ఈ రోజును వైకుంఠద్వారం పేరిట ఉన్న ప్రత్యేక ద్వారాన్ని తెరిచి ఉంచుతారు.పద్మ పురాణం ప్రకారం విష్ణువునుంచి ఉద్భవించిన శక్తి ముర అనే రాక్షసుడిని సంహరించిన రోజు వైకుంఠ ఏకాదశి. ముర అనే రాక్షసుడి దురాగతాలు భరించలేక దేవతలు విష్ణు భగవానుని శరణువేడగా ఆయన వాడితో తలపడి వాడిని సంహరించేందుకు ప్రత్యేక అస్త్రం కావాలని గ్రహించి బదరికాశ్రమంలోని హైమావతి గుహలోకి ప్రవేశించాడు. అక్కడ విశ్రమిస్తున్న విష్ణువును మురను



సంహరించేందుకు ప్రయత్నించగా ఆయన నుంచి ఒక శక్తి ఉద్భవించి తన కంటి చూపుతో మురను కాల్చి వేసింది. అప్పుడు విష్ణువు సంతసించి ఆమెకు ఏకాదశి అని పేరు పెట్టి వరం కోరుకోమని చెప్పాడు. ఆ రోజున ఉపవాసం ఉన్న వారి పాపాలను పరిహరించాలని ఆమె కోరింది. ధనుర్మాస శుక్ల ఏకాదశి రోజున ఉపవాసం ఉన్న వారికి వైకుంఠప్రాప్తి కలుగుతుందని విష్ణువు వరమిచ్చాడు. వైకుంఠ ఏకాదశి రోజు ముర బియ్యంలో దాక్కుంటాడని, అందుకే బియ్యంతో చేసిన ఏ పదార్థం తినకుండా ఉండాలని అంటారు. ఈ రోజున ఉపవాసం ఉంటే మిగతా 23 ఏకాదశులు ఉపవాసం ఉన్నట్టే అని విష్ణుపురాణం చెబుతోంది. ముర అంటే తామసిక, రాజసిక గుణాలకు, అరిషడ్వర్గాలకు ప్రతీక. వీటిని ఉపవాస జాగరణల ద్వారా జయిస్తే సత్వ గుణం లభించి తద్వారా ముక్తికి మార్గం ఏర్పడుతుంది. వరి అన్నంలో ముర నివాసం ఉంటాడు కనుక మందబుద్ధిని ఇచ్చి జాగురూకతను దెబ్బతీస్తాడని అంతరార్థం. ఏకాదశినాడు ఉపవాసం ఉండి, ద్వాదశినాడు అన్న దానం చేస్తారు. ఒకరోజు భోజనం చేయక తరువాతి రోజు చేయడం వలన జిహ్వాకు భోజనం రుచి తెలుస్తుంది.ముక్కోటి ఏకాదశి రోజు మనం కూడా ఉపవాస జాగారాలతో విష్ణుమూర్తిని పూజించి మోక్షాన్ని పొందుదాం.



**రవికుమార్ సంతోజు**

# ఊహించని వివాదంలో రాజాసాబ్ డైరెక్టర్



స్టేజ్ మీద యథాలాపంగా మాట్లాడే కొన్ని మాటలు పెద్ద వివాదానికే దారి తీస్తుంటాయి. సెలబ్రెటీలు ఆ మాటలు మాట్లాడేటపుడు వాటి తీవ్రత తెలియదు. కానీ సోషల్ మీడియా జనాల దృష్టిలోకి ఆ మాటలు చేరాయంటే ఇక అంతే సంగతులు. కొన్ని గంటల్లోనే ఆ విషయాలు కూడా పెద్ద వివాదాలుగా మారిపోతుంటాయి. ఇటీవల నటుడు శివాజీ హీరోయిన్ల వస్త్రధారణ గురించి చేసిన కామెంట్లు చుట్టూ ఎంత పెద్ద గొడవ జరిగిందో తెలిసిందే. వారం తర్వాత కూడా ఆ వివాదం సద్దుమణగలేదు. తాజాగా దర్శకుడు మారుతి చేసిన చిన్న కామెంట్.. సోషల్ మీడియాలో ఫ్యాన్ వార్స్‌కు దారి తీసింది. ప్రభాస్ అభిమానులకు అతడి వ్యాఖ్యలు ఆగ్రహం తెప్పించాయి.రాజాసాబ్ ప్రి రిలీజ్ ఈవెంట్లో మారుతి చాలా ఎమోషనల్ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభాస్ గురించి చాలా గొప్పగా మాట్లాడాడు.. తనకు ఇవ్వాల్సిన ఎలివేషన్ ఇచ్చాడు. సినిమా విషయంలో కూడా చాలా ధీమాగా మాట్లాడి అభిమానుల్లో ఉత్సాహం నింపాడు. కానీ స్పీచ్ మధ్యలో ప్రభాస్ ఒకప్పటి ఇమేజ్ గురించి అతను వాడిన ఒక పదం అభిమానులకు కోపం తెప్పించింది. మీడియం రేంజ్ హీరోగా ఉన్న ప్రభాస్‌ను రాజమౌళి పాన్ ఇండియా సూపర్ స్టార్‌ను చేశాడని.. అందుకు ఆయనకు దర్శకులందరూ రుణపడి ఉంటారని ఒక కామెంట్ చేశాడు మారుతి. ఇందులో దురుద్దేశం ఏమీ లేకపోయినా.. ఒకప్పుడు ప్రభాస్ మీడియం రేంజ్ హీరో అని పేర్కొనడం రెబల్ ఫ్యాన్స్‌కు నచ్చలేదు. వాళ్లు స్పందించడాని కంటే ముందు యాంటీ ఫ్యాన్స్ ఈ మాటను పట్టుకుని ప్రభాస్‌ను ట్రోల్ చేయడం మొదలుపెట్టారు.

# దెయ్యాలకు పట్టం కట్టిన ప్రేక్షకులు




ఏడాది చివర్లో వచ్చిన క్రిస్మస్ ఈసారి టాలీవుడ్ బాక్సాఫీస్ కు ఊహించని ఫలితాలు ఇచ్చింది. పోటీ గట్టిగానే ఉన్నప్పటికీ ప్రేక్షకుల తీర్పు అనూహ్యం. వచ్చిన అరడజను సినిమాల్లో సాలిడ్ బ్రేక్ ఈవెన్ దాటేసి లాభాల్లోకి వేగంగా ప్రవేశించిన సినిమాలు రెండు. అవి శంబాల, ఈషా. వీటిలో ఉన్న కామన్ పాయింట్ హారర్. దెయ్యాల నేపథ్యంలో సాగుతాయి. ఆది సాయికుమార్ మూవీలో దేవుళ్ళ ప్రస్తావన ఉన్నప్పటికీ ఒక పావు గంట మినహాయించి మొత్తం ఊరి జనాన్ని చంపేసే భూతం గోలే ఉంటుంది. అయినా సరే జనాలకు కనెక్ట్ అయ్యింది. సోమవారం డ్రాప్ ఎలా ఉంటుందనేది పక్కనపెడితే చక్కగా సేఫ్ జోన్ లోకి వెళ్ళిపోయింది. ఇక ఈషాకు నెగటివ్ రివ్యూలు ఎక్కువగా వచ్చాయి. కంటెంట్, ప్రొడక్షన్ క్వాలిటీ మీద క్రిటిక్స్ కాస్త గట్టిగానే తలంటారు. అయినా సరే ప్రేక్షకులు ఓసారి చూద్దామనుకున్నారు. బడ్జెట్, బిజినెస్ రెండూ తక్కువే కాబట్టి ఈజీగా గెటాన్ అయ్యే ఛాన్స్ కొట్టేసింది. రేపటి నుంచి అద్భుతాలు జరగకపోవచ్చు కానీ కాగల కార్యం శుక్రవారం నుంచి ఆదివారం మధ్యలో జరిగిపోయింది. అనూహ్యంగా భారీ బడ్జెట్ తో రూపొందిన ఛాంపియన్ ఎదురీదాల్సి రావడం ఊహించని పరిణామం. ప్రయత్నంలో నిజాయితీ ఉన్నప్పటికీ యునానిమస్ గా ఆడియన్స్ ని మెప్పించడంలో దర్శకుడు పడిన తడబాటు రిజల్ట్ మీద ఎఫెక్ట్ చూపిస్తోంది. అయితే కథ ఇక్కడితో అయిపోలేదు. జనవరి 1 రూపంలో క్రిస్మస్ బంచ్ మూవీస్ కి ఇంకో ఛాన్స్ అయితే ఉంటుంది. విచిత్రంగా పాజిటివ్ రెస్పాన్స్ తెచ్చుకున్న దండోరా ఈ హారర్ కాంపిటీషన్ లో నిలవలేకపోయింది. సోలోగా వచ్చి ఉంటే బాగా ఆడేదనే కామెంట్స్ ఇండస్ట్రీలో వినిపిస్తున్న నేపథ్యంలో నిర్మాతలు రాంగ్ టైమింగ్ లో రిలీజ్ చేశారనేది అంత సులభంగా కొట్టి పారేయలేని విషయం.

# విజయ్ మాట మీద ఉండాల్సిందేనా



మలేషియాలో జరిగిన జన నాయకుడు ఈవెంట్ లో ఇదే తన చివరి సినిమా అని ప్రకటించిన విజయ్ భవిష్యత్తులో ఇదే మాట మీద ఉంటాడానే అనుమానాలు కోలీవుడ్ వర్గాల్లో తలెత్తుతున్నాయి. ఎందుకంటే గతంలో ఎందరో స్టార్లు ఇలాంటి మాటలు చెప్పి తర్వాత తిరిగి మేకప్ వేసుకున్న దాఖలాలు చాలా ఉన్నాయి. మన దగ్గర చిరంజీవి, పవన్ కళ్యాణ్ లాంటి సీనియర్లు ఉదాహరణగా కనిపిస్తే తమిళంలో రజనీకాంత్, కమల్ హాసన్ ఎగ్జాంపుల్ గా ఉన్నారు. అయితే విజయ్ ఫ్యాన్స్ ఇంకో వెర్షన్ చెబుతున్నారు. తమ నాయకుడు ఎంజిఆర్, జయలలిత లాగా సీరియస్ పాలిటిక్స్ చేసి మళ్ళీ సినిమాల్లోకి రారని బల్లగుద్ది చెబుతున్నారు. వచ్చే ఏడాది తమిళనాడు ఎన్నికలు రాబోతున్నాయి. అందులో గెలిచేసి ముఖ్యమంత్రి అయిపోతాననే భ్రమలో విజయ్ లేడు. ఒకవేళ పట్టం కడితే సంతోషమే. తేవాలనుకున్న మార్పు ముందుగానే సాధ్యమవుతుంది. లేదూ అంటే ఇంకో అయిదు సంవత్సరాల టైం దొరుకుతుంది. మరింత ప్రణాళికతో ముందుకు వెళ్లొచ్చు. విజయ్ వయసు ప్రస్తుతం 51 సంవత్సరాలు, ఇంకో ముప్పై ఏళ్ళు పాలిటిక్స్ లోనే ఉంటానని చెబుతున్నాడు. ఒకవేళ పార్టీ పెట్టకుండా ఇండస్ట్రీలోనే కొనసాగి ఉంటే సులభంగా వంద సినిమాల మైలురాయి అందుకునే అవకాశం ఉండేది. తెలిసి మరీ వదులుకోవడం విజయ్ కమిట్ మెంట్ కి నిదర్శనం. అయితే యాంటీ ఫ్యాన్స్ ఇంకోలా ఎక్స్ పెక్ట్ చేస్తున్నారు. ఎలక్షన్లలో ఓడిపోతే విజయ్ తిరిగి మళ్ళీ సినిమాల్లోకి వస్తాడని, ఎప్పుడు వచ్చినా జనం ఎలాగూ ఆదరిస్తారు, నిర్మాతలు కోట్లు ఇస్తారు కాబట్టి నిర్ణయం మార్చుకున్నా ఆశ్చర్యం లేదని అంటున్నారు. ఇదంతా తేలాలంటే ఇంకో రెండేళ్లు ఈజీగా పడుతుంది.

# 'రాజు వెడ్స్ రాంబాయి' హీరోకు బంపర్ ఆఫర్..



బ్యూటిఫుల్ అనుపమ పరమేశ్వరన్ 2025లో మంచి సినిమాలతోనే వచ్చింది. కానీ 'పరదా' చిత్రం తగినంత సక్సెస్ అందుకోకపోవడంపై నిరాశ వ్యక్తం చేసింది.ఇక తాజాగా ఆమె మరో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఓ పెద్ద నిర్మాణ సంస్థ నిర్మించనున్న సినిమాలో హీరోయిన్‌గా ఓకే చెప్పిందని.. ఇందులో 'రాజు వెడ్స్ రాంబాయి' ఫేమ్ అఖిల్ రాజ్ హీరోగా నటించనున్నాడనే టాక్ వినిపిస్తోంది. ఇదే నిజమైతే.. అఖిల్ రాజ్ గ్రాఫ్ పెరుగుతున్నట్లే అంటున్నారు విశ్లేషకులు. ఇప్పటికే వరుసగా 'రాజు వెడ్స్ రాంబాయి', 'ఈషా'తో రెండు హిట్లు అందుకున్న యంగ్ హీరోకు ఇండస్ట్రీ నుంచి వరుస అవకాశాలు వస్తుండగా.. పాత్రలు ఎంచుకునే విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నట్లు తెలుస్తోంది. అయితే ఓ కుర్ర హీరో పక్కన నటించేందుకు అనుపమ ఓకే చెప్పిందంటే కంటెంట్ ఉన్న సినిమానే అంటున్నారు విశ్లేషకులు.

# ఓ అందాల రాక్షసి.. వచ్చే ఏడాదిలో బెస్ట్ మూవీ ఇదే..



దర్శకుడిగా, హీరోగా, సంగీత దర్శకుడిగా, కథకుడిగా షెరాజ్ మెహదీ అందరినీ ఆకట్టుకుంటూ ఉన్నారు. ప్రస్తుతం ఆయన 'ఓ అందాల రాక్షసి' అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో విహాన్షి హెగ్డే, కృతి వర్మ హీరోయిన్లుగా నటించారు. స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్‌పై సురీందర్ కౌర్ నిర్మించిన ఈ చిత్రం.. జనవరి 2న రాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ సందర్భంగా మాట్లాడిన షెరాజ్ మెహదీ..”ఓ అందాల రాక్షసి' మూవీని జనవరి 2న భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నాం. ఏడాదికి ఓ మంచి సినిమా వస్తుంది. అలాంటి ఓ మంచి సినిమానే మా 'ఓ అందాల రాక్షసి'. ఇందులో కృతి వర్మ, విహాన్షి హెగ్డే, నేహా దేశ్ పాండే, అఖిల, గీతా రెడ్డి, స్నేహా, ప్రియా దేశ్ పాల్, సుమన్ గారు, తమ్మారెడ్డి భరద్వాజ్.. ఇలా చాలా మంది అద్భుతమైన పాత్రల్ని పోషించారు. అద్భుతమైన కంటెంట్‌తో రాబోతున్న చిత్రం చూస్తుంటే... ఆడియన్స్‌కి ఒక్క నిమిషం కూడా బోర్ కొట్టదు. మంచి సందేశాత్మక కథతో ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. ఇందులోని ట్విస్ట్‌లు అద్భుతంగా ఉంటాయి. అమ్మాయిలకు నచ్చే చిత్రం అవుతుంది' అని తెలిపారు.

# ఆ రోజులు పోయాయి




ఈ ఏడాదిని రష్మిక నామ సంవత్సరం అనంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే.. ఈ ఏడాదంతా పానిండియా రేంజ్‌లో అదరగొట్టేసింది రష్మిక. చావా, సికిందర్, థమ్మా.. మూడు బాలీవుడ్ సినిమాలు. తెలుగు, తమిళ బైలింగ్వల్”కుబేరా'. అలాగే లేడీ ఓరియెంటెడ్ మూవీ 'ది గాళ్‌ఫ్రెండ్'. ఒక్క ఏడాదిలోనే అయిదు సినిమాలు. ఈ ఏడాదిలో ఇన్ని సినిమాలు చేసిన హీరోయిన్ లేదు. ప్రస్తుతం హిందీ 'కాక్‌టెయిల్', తెలుగు 'మైసా' సినిమాలు నిర్మాణ దశలో ఉన్నాయి. తాజాగా ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాత్రల ఎంపిక విషయంలో తనలో వచ్చిన మార్పు గురించి ఆసక్తికరంగా మాట్లాడింది రష్మిక. 'నటిగా సినిమా సినిమాకీ బాధ్యత పెరుగుతూనే ఉంది. ఇప్పుడు పాత్రల కోసం వెంపర్లాడే స్థితి నుంచి, మంచి పాత్ర కోసం ఆరాటపడే స్థాయికి చేరుకున్నాను. డబ్బు కోసం మాత్రమే సినిమాలు చేసే రోజులు పోయాయి. ప్రస్తుతం నా కోసం రచయితలు ప్రత్యేకంగా కథలు తయారు చేస్తున్నారు. ఓ విధంగా ఇది నా విజయం. ఫలానా తరహా పాత్రలే చేయాలని అనుకోవడం లేదు. నా కంటే రచయితలనే ఈ విషయంలో ఎక్కువగా నమ్ముతాను. నాకు సూటయ్యే పాత్రలనే వారు నా దగ్గరకు తెస్తారని నా నమ్మకం.' అని తెలిపింది రష్మిక.

# ఉన్నన్ని రోజులూ సంతోషంగా బతుకుదాం..



కన్నడ అగ్ర నటులు శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి.శెట్టి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ '45 ది మూవీ'. ఈ చిత్రానికి కథ, సంగీతం, దర్శకత్వం అర్జున్ జన్య. ఉమా రమేష్‌రెడ్డి, ఎం.రమేష్‌రెడ్డి నిర్మాతలు. జనవరి 1న చిత్రం విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ 'కన్నడంలో ఈ సినిమా ఆల్రెడీ సక్సెస్ అయ్యింది. ఈ సినిమా చూస్తే, ప్రతి ఒక్క ప్రాణినీ ప్రేమిస్తారు.. గౌరవిస్తారు. ఈ భూమ్మీద ఎన్నాళ్లుంటామో తెలీదు.. ఉన్నని రోజులూ సంతోషంగా బతకాలని చెప్పే మూవీ ఇది.' అన్నారు. మునుపెన్నడూ చూడని కొత్త శివన్నను ఇందులో చూస్తారని, ఇప్పటివరకూ చేయని భిన్నమైన పాత్రను ఇందులో చేశానని, పైకి సౌమ్యంగా కనిపించే దర్శకుడు అర్జున్ తెరపై మాత్రం విధ్వంసం సృష్టించారని ఉపేంద్ర పేర్కొన్నారు. '45' మూవీలో ఓ కొత్త ప్రపంచాన్ని చూస్తారని దర్శకుడు అర్జున్ జన్య తెలిపారు. మైత్రీ మూవీమేకర్స్ ఈ సినిమా విడుదల చేస్తున్నందుకు నిర్మాతలు ఆనందం వెలిబుచ్చారు. మైత్రీ శశి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రజనీకాంత్‌తో లవ్ స్టోరీ ప్లాన్.. లేడీ డైరెక్టర్ ప్లాన్ అదుర్స్..



పరాశక్తి'తో హిట్ కొట్టేందుకు సిద్ధమైంది డైరెక్టర్ సుధా కొంగర. శివ కార్తికేయన్, జయం రవి, అథర్వ, శ్రీలీల ప్రధానపాత్రల్లో నటించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఈ క్రమంలో ప్రమోషన్స్ జోరుగా చేస్తున్నారు మేకర్స్. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. చిత్రం గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. తన డ్రీమ్ ప్రాజెక్ట్ గురించి కూడా చెప్పింది.సూపర్ స్టార్ రజనీకాంత్‌తో సాఫ్ట్, ఎమోషన్ డ్రివెన్ లవ్ స్టోరీ చేయాలనేదే తన కల అని.. ఆయనను కంప్లీట్‌గా న్యూ అండ్ రిఫ్రెషింగ్ సైడ్ చూపించాలనేదే తన కోరిక అని తెలిపింది. దీంతో తలైవా ఫ్యాన్స్ ఖుష్ అవుతున్నారు. వెంటనే ప్రాజెక్ట్ స్టార్ట్ చేస్తే బాగుంటుందని.. డేట్స్ సర్దుబాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇక 'పరాశక్తి' సినిమా 1970లలో హిందీ ఇంపోజింగ్ కారణంగా కలిగిన ఉద్యమం గురించి వివరిస్తుంది. అయితే సెన్సార్ బోర్డు కీలకమైన సీన్స్ కట్ చేయగా రివ్యూ కమిటీకి వెళ్లిన మూవీ టీమ్.. విడుదలను క్లియర్ చేసుకుంది.

## ఉన్నత విద్యాభివఅద్ధికి

# ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేయాలి

- కార్పోరేట్ యూనివర్సిటీలను రద్దు చేయాలి

- ఏఐఎస్‌బి రాష్ట్ర ఉపాధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల అభివఅద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దఅష్టి సారించి తక్షణమే నిధులు కేటాయించాలని అతికం రాజశేఖర్ గౌడ్ కోరారు. రాష్ట్రంలోని అనేక యూనివర్సిటీల్లో మౌళిక వసతుల లేమి కారణంగా విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో నూతన అకడమిక్ భవనాలు, హాస్టళ్లు, ల్యాబ్‌లు వంటి మౌళిక సదుపాయాల కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వసతుల కొరతను సమగ్రంగా అధ్యయనం చేసి పరిష్కారాలు సూచించేందుకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు.అదేవిధంగా, రాష్ట్రంలో ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులు ఇవ్వకుండా ప్రభుత్వ యూనివర్సిటీలను బలోపేతం చేయాలని, కార్పొరేట్ ప్రైవేట్ యూనివర్సిటీలను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల అభివఅద్ధితోనే నాణ్యమైన,అందుబాటు ఉన్న ఉన్నత విద్య సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, సురేష్ తదితరులు పాల్గన్నారు.

## తెలంగాణ జర్నలిస్టు జేఏసీ రాష్ట్ర కో కోఆర్డినేటర్‌గా కీర్తి సంతోష్ రాజ్ నియామకం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ జర్నలిస్టు జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్లుగా రాష్ట్ర వ్యాప్తంగా 33 మందిని నియమించింది. హైదరాబాద్ ప్రాంతం నుంచి కీర్తి సంతోష్ రాజ్ ను నియమిస్తున్నట్లు తెలంగాణ జర్నలిస్టు జేఏసీ ప్రకటించింది. ఈ సందర్భంగా కీర్తి సంతోష్ రాజ్ మాట్లాడుతూ జర్నలిస్టు వఅత్తి కత్తి మీద సామ లాంటిదని వార్తలు రాయాలంటే అధికారులకు, రాజకీయ నాయకులకు జేజేలు కొట్టి రాస్తే వార్త ఆనంద పడతారని, వాళ్లు చేసే అన్యాయాలు అక్రమాలపై ప్రశ్నిస్తే నోటికొచ్చినట్లు మాట్లాడతారని తప్పుడు కేసులు పెడతారని అలాంటి పత్రిక రంగంలో పనిచేస్తున్న పాత్రికేయ మిత్రుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రశ్నించే గొంతుకగా పాత్రికేయుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా నిలబడతానని, పాత్రికేయ కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం, ఉచిత విద్యను అందించాలని, అలాగే తెలంగాణ రాష్ట్రంలో పత్రికా విలేకరులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ని ప్రవేశపెట్టాలని, జర్నలిస్టులపై జరిగే దాడులకు ప్రత్యేక చట్టం ఈ అసెంబ్లీ సమావేశాల్లో తీసుకురావాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైల్లో ఉచిత ప్రయాణాన్ని కొనసాగించే విధంగా ప్రోత్సహించాలని, టోల్ టాక్స్ ల వద్ద జర్నలిస్టులకు మినహాయింపు ఇవ్వాలని, టిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన జీవోను అమలు చేయాలని అక్రిడేషన్ విషయంలో ప్రభుత్వం జర్నలిస్టు యూనియన్ నాయకుల సూచనలు తీసుకోవాలని ఎవరో కొంతమంది చెప్పినంత మాత్రాన జర్నలిస్టులకు అన్యాయం చేయొద్దని, వార్తా సేకరణలో పనిచేసే ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వం తప్పనిసరిగా అక్రిడేషన్ కార్డును ఇవ్వాలని, అక్రిడేషన్ లో కోత విధించొద్దని, ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి పార్టీ కార్యకర్తల కంటే జర్నలిస్టులే తీసుకువెళ్తారని అలాంటి జర్నలిస్టులను ప్రభుత్వాలు కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూడాలని ఈ సందర్భంగా కీర్తి సంతోష్ రాజ్ అన్నారు.

# ఒకే ఒక్క ఓటుతో గెలుపు..

## ఇది ఓటు విలువ యొక్క గొప్పతనం

**- నిమ్మనపల్లి రెండో వార్డ్ మెంబర్'గా గొడిసెల మమత - నంబయ్య**

**- సర్పంచ్'గా వేల్పుల రమేష్..**



**మంథని (ప్రశ్న న్యూస్)** పెద్దపల్లి జిల్లా కేంద్రాన్ని అనుకొని ఉన్న పెద్దపల్లి మండల పరిధిలోని నిమ్మనపెల్లికి చెందిన గొడిసెల మమతా నంబయ్య ఆ గ్రామపంచాయతీ పరిధిలోని రెండవ వార్డ్ మెంబర్ గా గెలవడం అసాధారణం అయినట్టు కనిపించింది. వార్డ్ మెంబర్ పోటీలో ఎవరూ లేరు అనుకున్న తరుణంలో వేసిన నామినేషన్ ఎన్నికల బరిలో హోరాహోరిపోటికి దారి తీసింది. ఈ నేపథ్యంలో వార్డ్ మెంబర్ గా నిల్చున్న గొడిసెల మమత నంబయ్య స్థానికులు కాదని తనకు ఓటు వేయొద్దన్న ప్రచారమే ఎక్కువగా జరిగిందన్నారు. అయినప్పటికీ తాను తన భర్త ఇచ్చిన స్పూర్తితో ముందుకు సాగానన్నారు. బతుకుదెరువు కోసమే అక్కడికి వెళ్లాల్సి వచ్చిన గ్రామ ప్రజలు నన్ను గుండెల్లో పెట్టుకొని వార్డ్ మెంబర్ గా గెలిపించారని వారి సహఅదాయానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇకనుండి గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటు నేను మన ఈ ఊరి, గ్రామ అభివఅద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా అన్నారు. ఇకపైనుండి నా ఊరు నా ప్రజలే ముఖ్యమని వారికి ఎలాంటి అవసరం వచ్చిన ముందుండి పని చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేల్పుల రమేష్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న పార్టీ నేతలు పోటీ చేసినప్పటికీ తనను మాత్రం సర్పంచ్ గా గెలిపించిన ఓటర్ మహాశయులకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని అన్నారు. ప్రజా శ్రేయస్సు పరమావధిగా పని చేస్తానని నేను చేసే పని పట్ల ఎలాంటి సొమ్మును ఆశించనని తన మన అనే తే డ లేకుండా ఎవరికి ఏ కష్టం వచ్చినా తన వంతు బాధ్యతగా ముందుండి పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఇరువురి ప్రతినిధులకు ఘనంగా శాలువాతో సత్కరించి సన్మానించారు. ఇంకా ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజ్ కుమార్, జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్.హెచ్.ఆర్.సి) రాష్ట్ర నాయకులు ఇంజం సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి అడప బాపురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గోడిసెల నంబయ్య,జిల్లా సోషల్ మీడియా ఇంచార్జి పరకాల లక్ష్మణ్ గౌడ్ జిల్లా సభ్యులు ఆరెపల్లి శ్రీదేవి,గద్దల అనిల్ కుమార్, వేముల రాజేంద్ర ప్రసాద్, పెరుక కిషోర్ కుమార్ తదితరులు పాల్గన్నారు.

## ఘనంగా వాసవి సేవా సమితి వార్షికోత్సవం



**నాచారం(ప్రశ్న న్యూస్)** సమాజ సేవలో తమ వంతుగా సేవలందించాలనే ఉద్దేశంతో శ్రీ వాసవి సేవా సమితి ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. 10 సంవత్సరాలలో అంచలంచెలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ కరోనా సమయంలో పేద ప్రజలకు ఆహార ధాన్యాలు అందించామన్నారు. నాచారం వాసవి సేవాసమితి 10 వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2016 లో 17మందితో ప్రారంభమై నేడు వంద మంది చేరుకోవడంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా ప్రతి అమావాస్యకు నాచారం మహంకాళి దేవాలయం వద్ద 12వందల మందికి అన్నదానం చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. త్వరలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా వాసవి సేవా సమితి నిర్వాహకుడు శ్రీరామ్ సత్యనారాయణ ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో ఇటీవల మఅతి చెందిన "కొప్పుల పోచమ్మ" కుటుంబాన్ని సోమవారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప సానుభూతిని తెలిపారు. వారి వెంట ఉడుతల రాము,బోనాల శివ,శ్రీనివాస్ తదితర నాయకులు ఉన్నారు.

## సర్ధన రేషన్ డీలర్ వెంకట్ మృతి బాధాకరం.

- నివాళులర్పించిన మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మాదేవేందర్ రెడ్డి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా హవెలిఘనపూర్ మండలం సర్ధన గ్రామ మాజీ సర్పంచ్ కవిత భర్త రేషన్ డీలర్ వెంకట్ (పెన్సిల్ ) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం.పద్మాదేవేందర్ రెడ్డి సోమవారం సర్ధన గ్రామానికి చేరుకొని వెంకట్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం వెంకట్ భర్త కవితను పరామర్శించి ఓదార్చారు. మనోధైర్యాన్ని కల్పించాలని ఆ భగవంతుని ప్రార్థించారు.అనారోగ్యంతో వెంకట్ మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు.ఈ సందర్భంగా రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు.వీరి వెంట గ్రామ సర్పంచ్ వినోద సతీష్,మాజీ వైస్ ఎంపీపీ రాధా కిషన్ యాదవ్,గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాపు కిషన్,వార్డ్ మెంబర్ రమేష్, హవెలిఘనపూర్ సర్పంచ్ మ్యాకల. సాయిలు,నాయకులు సతీష్ రావు రాజేశ్వరరావు, లక్ష్మణ్, సంతప్ప, భువనేశ్వర్,రంజిత్ యాదవ్, దుర్గేష్,శ్రీనివాస్ చారి తదితరులు ఉన్నారు.

# అర్ధవంతమైన లక్ష్యాలను సాధించాలి

- యువతకు జేఎన్ యూ ప్రొఫెసర్ డాక్టర్ గుడవర్తి అజయ్ ఉద్బోధ



**పటాన్‌చెరు (ప్రశ్న న్యూస్)** నేటి తరం విద్యార్థులు అర్థవంతమైన లక్ష్యాలను సాధించాలని, సమాజానికి సృజనాత్మకంగా దోహదపడాలని న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్ యూ)లోని రాజకీయ అధ్యయనాల కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్, ప్రముఖ రాజకీయ సిద్ధాంతకర్త, విశ్లేషకుడు డాక్టర్ అజయ్ గుడవర్తి సూచించారు.గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లోని రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం 'జెన్ జీ (నేటి యువత) %-% భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు' అనే అంశంపై ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ప్రజాస్వామ్యంలో జెన్ జీ యొక్క ప్రమేయంపై సూక్ష్మ అవగాహనను అందించారు. విలువలు, నీతి, రాజకీయ పద్ధతులలో వేగవంతమైన అంతర్గత మార్పులను డాక్టర్ అజయ్ ప్రముఖంగా ప్రస్తావించారు. జెన్ జీ రాడికల్ వ్యక్తిత్వం, సామాజిక ఉదాసీనతను ప్రదర్శిస్తున్నప్పటికీ, అది ఏకకాలంలో తక్కువ పక్షపాతంతో, మరింత సమ్మిళితంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. సమకాలీన యువత నేతృత్వంలోని రాజకీయ ఉద్యమాలు ఎక్కువగా నాయకత్వం లేనివి, ఎపిసోడిక్ గా ఉన్నాయని, సామూహిక రాజకీయాల యొక్క సాంప్రదాయ భావనలను పునర్నిర్మించే సైద్ధాంతిక బోధన కంటే ఆదర్శప్రాయమైన చర్య ద్వారా నడపబడుతున్నాయని అన్నారు.జెన్ జీను వర్ణించే విశ్వాసం, ఆందోళన యొక్క వైరుధ్యాలను డాక్టర్ అజయ్ గుడవర్తి మరింత విపులీకరించారు. దీనిని సరళీకరణ అనంతర యుగంలో కుంచించుకుపోతున్న ఆర్థిక అవకాశాలతో పాటు విస్తరించిన సామాజిక ప్రజాస్వామ్యానికి అనుసంధానించారు. నేటి యువత రాజకీయాలను రూపొందించడంలో గుర్తింపు, రాజకీయ ఆత్మాశ్రయత, వినియోగం యొక్క పెరుగుతున్న కలయికను కూడా ఆయన నొక్కి చెప్పారు. చివరగా విద్యార్థులు, పలువురు అధ్యాపకులతో ముఖాముఖి చర్చించి, వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ ఆతిథ్య ఉపన్యాస కార్యక్రమాన్ని సుప్రీ రంజన్ సమన్వయం చేశారు. జీఎస్ హెచ్ఎస్ ఇన్-ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ తరు, డాక్టర్ మయాంక్ మిశ్రా, రిషిజా సింగ్, పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలు

# సురక్షితంగా జరుపుకోవాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు,



**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్)** నూతన సంవత్సర వేడుకలను ప్రజలు సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు, సూచించారు. ప్రమాదాలకు దూరంగా ఉండేందుకు పిల్లలు, పెద్దలు కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇండ్లలోనే వేడుకలు జరుపుకోవాలని, పోలీసు శాఖ జారీ చేసిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు.డిసెంబర్ 31 రాత్రి 8 గంటల నుంచే జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తుందని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని పేర్కొన్నారు.ప్రధాన కూడళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా చట్ట వ్యతిరేక చర్యలను గుర్తించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నాన్%-%బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.డిసెంబర్ 31 రాత్రి ఎలాంటి ఆర్గనైజ్డ్ వేడుకలకు పోలీసు అనుమతి లేదని, టపాసులు మరియు డీజేలు పూర్తిగా నిషేధమని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్లు తొలగించి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేయడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మైనర్లకు మద్యం విక్రయించడం నేరమని తెలిపారు.రహదారులు బ్లాక్ చేయడం, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, ప్రైవేట్ మరియు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం, వీధి దీపాలు ధ్వంసం చేయడం, నిషేధిత డ్రగ్స్, గంజా వంటి మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగం జరిగితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.మద్యం దుకాణాలు నిర్ణీత సమయాల్లోనే మూసివేయాలని, బహిరంగ ప్రదేశాలు మరియు ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏ కార్యక్రమం నిర్వహించినా ముందస్తు పోలీసు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు.న్యూ ఇయర్ ఆఫర్ల పేరిట సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నందున, ఆన్లైన్‌లో అపరిచితులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్ నంబర్లు ఇవ్వవద్దని ప్రజలను హెచ్చరించారు.నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ గారు స్పష్టం చేస్తూ, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక పోలీసు అధికారులను లేదా డయల్ 100కు ఫోన్ చేసి పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## పోతరాజుపల్లి పెంతేకొస్తూ ఫిలదేల్ఫియా చర్చిలో పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన మాజీ సర్పంచ్, లీడర్ షిప్ చైర్మన్ లయన్ బుడ్డ భాగ్యరాజ్



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** తూప్రాన్ మున్సిపల్ పరిధిలో 8వ వార్డు పోతరాజుపల్లి పెంతే కోస్ట్ ఫీలదేలిపియా పార్థనా మందిరంలో సోమవారం ఉదయం ఫాస్టర్ ఫాదర్ బెన్నీ శ్రీలత ల ఆధ్వర్యంలో నిరుపేద క్రైస్తవ కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పోతరాజుపల్లి పెంతేకొస్తూ ఫిలదేల్ఫియా చర్చిలో మాజీ సర్పంచ్, లీడర్ షిప్ చైర్మన్ లయన్ బుడ్డ భాగ్యరాజ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఫాస్టర్ బెన్నీ శ్రీలత ఆధ్వర్యంలో బుడ్డ స్వర్ణలతభాగ్యరాజ్ గురించి ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ బెన్నీ మాట్లాడుతూ సంఘ సేవకులు బుడ్డ భాగ్యరాజ్ ఆయురారోగ్యాలతో ఆర్థికంగా దిన దినాభివృద్ధి చెంది మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని దీవిస్తూ కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ జానకిరామ్ తోపాటు లయన్ డాక్టర్ అప్సర్ భాయ్, లయన్ కుమ్మరి రమేష్, తిరుపతి,ప్రముఖ రాజకీయ నాయకులు, మాజీ సర్పంచ్, లీడర్ షిప్ చైర్మన్ లయన్ బుడ్డ భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యం ప్రధమ నినాదం

- డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్



**అమీన్‌పూర్(ప్రశ్న న్యూస్)** ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా అమీన్‌పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ డివిజన్‌లో కొనసాగుతున్న పారిశుధ్య పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో లోపాలు లేకుండా విధులు నిర్వహించాలని అలసత్వం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలుతీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## వార్డ్ సభ్యులకు వంట సామాగ్రి అందజేత



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) కొల్చారం మండల పరిధిలోని సోమవారం నాడు తుక్కాపూర్ లో ఏడవ వార్డు సభ్యురాలుగా గెలుపొందిన ఆయిలి మమతా శ్రీనివాస్ వార్డు పరిధిలోని కుటుంబ సభ్యుల సామూహిక అవసరాల కోసం రూ 25 వేల రూపాయల టెంట్ హౌస్ సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు, ఉపసర్పంచ్ ఆరే రవీందర్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఆయిలి మల్లేశం, గ్రామస్తులు టేక్మాల్ మల్లప్ప,సిద్దప్ప, బ్యాగరి గోపాల్, ఎలుక చంద్రం, శేఖర్,శేఖయ్య, దానయ్య, మహిళలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# గ్రేటర్ విస్తరణ . . .
# పాలన మెరుగుపడేనా.?

**- జిహెచ్ఎంసిలో అవినీతి ఆరోపణలు, మౌనంగా ఉన్న వ్యవస్థ**

- ఐఏఎస్ స్థాయి అధికారులు ఉన్న నీతివంతమైన పాలనలో సున్న
- ప్రజల ఫిర్యాదులు బుట్టదాకాలే, చెప్పులు అరిగేలా మున్సిపల్ కార్యాలయల చుట్టూ ప్రదర్శనలు
- అవినీతి అధికారులను జోనల్ కమిషనర్లు కట్టడి చేస్తే జిహెచ్ఎంసి పాలనలో నంబర్ వన్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ పరిధి విస్తరణతో నగరం మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్న ఆశలు ప్రజల్లో కలిగాయి. కానీ పరిపాలనలో వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఐఏఎస్ స్థాయి అధికారులు జోనల్ కమిషనర్లుగా ఇతరులు నిర్వహిస్తున్న ప్రజల సమస్యలు తీర్చడంలో పూర్తిగా విఫలం చెందిన ఆరోపణలు ఉన్నాయి ప్రస్తుతం మరింత విస్తరించడంతో ఐఏఎస్ స్థాయి అధికారులు మరి తమ సేవలను మెరుగు స్థాయిలో అందిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

### గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)

ప్రతి విభాగంలోనూ అవినీతి, అక్రమాలు జోరుగా సాగుతున్నాయన్న విమర్శలు ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు, రాజకీయ వర్గాల నుంచే వెల్లువెత్తుతున్నాయి. అయినా ప్రభుత్వం మున్సిపల్ కార్యాలయాలలో జరుగుతున్న అవినీతి అక్రమాలను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలం చెందాయి. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ మరింత విస్తృతి చెందడంతో ఇక అవినీతికి హద్దు అదుపు లేకుండా పోతుందన్న భయం ప్రజలు స్పష్టంగా కనిపిస్తోంది.

### విస్తరణతో బాధ్యత పెరిగిందా.? అవినీతి కూడా పెరిగిందా.?

గ్రేటర్ పరిధి పెరగడంతో కొత్త డివిజన్లు, జోన్లు ఏర్పడ్డాయి. అభివృద్ధి పనులు, కాంట్రాక్టులు, అనుమతులు భారీగా పెరిగాయి. అదే సమయంలో అవినీతికి కూడా కొత్త మార్గాలు తెరుచుకున్నాయన్నది ప్రధాన ఆరోపణ. రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్‌లైట్లు, పార్కులు, భవన అనుమతులుఏ విభాగాన్ని తాకినా "లంచం లేకుండా పని జరగదు" అన్న మాటలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ శాఖ అంటేనే అవినీతికి కేంద్ర బిందువుగా మారింది ఒక్కొక్క అధికారి వందల కోట్ల అవినీతి సంపాదించారన్న ఆరోపణలు ఉన్నాయి వీళ్లపై ఏసీబీ అధికారులు దాడులు చేయలేదన్న విమర్శలు లేకపోలేదు. దీనికి తోడు జిహెచ్ఎంసిలో విజిలెన్స్ విభాగం ఉన్న అవినీతి అధికారులను కట్టడి చేయడంలో సున్నా అన్న రీతిగా జిహెచ్ఎంసి పాలన సాగుతోంది మరి విస్తరణలో ప్రభుత్వం కట్టడి చేయగలరా లేకుంటే మరింత అవినీతి అక్రమాలను చూస్తూ ఉండిపోగలద.

### అక్రమ నిర్మాణాలపై చర్యలెక్కడ.?

గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా అధికారుల అవినీతికి నిదర్శనంగా మారిన అక్రమ నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు వచ్చినా, నోటీసులు ఇచ్చి భారీగా లంచాలు తీసుకొని ఆపై కళ్లుమూసుకునే పరిస్థితి ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్





వ్యాపారాలు సాగుతున్నా కూల్చివేతలు జరగడం లేదు. "సెట్టిల్‌మెంట్లు" కోసమే టౌన్ ప్లానింగ్ వ్యవస్థ మారిందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిని కట్టడి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ప్రజలు బాహాటంగా ఆరోపిస్తున్నారు.

### విజిలెన్స్ విభాగం పనితీరు శూన్యమా.?

అవినీతిని కట్టడి చేయాల్సిన జిహెచ్ఎంసి విజిలెన్స్ విభాగం నిర్వీర్యంగా మారిందన్న ఆరోపణలు తీవ్రమయ్యాయి. ఫిర్యాదులు పెరిగినా విచారణలు ముందుకు సాగకపోవడం, ఫిర్యాదులపై అవినీతి అధికారులపై చేసిన నివేదికలు దాచిపెట్టడం, కీలక కేసుల్లో మౌనంఇవన్నీ ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నాయి. "విజిలెన్స్ అధికారులు అవినీతి అధికారులను కట్టడి చేయడంలోనే కనుమరుగయ్యారా.? లేక కుమ్మక్కయ్యారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఉన్నతాధికారుల మౌనం ఎందుకు.?

ప్రతి విభాగంపై అనేక ఆరోపణలు ఉన్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడం అనుమానాలను మరింత పెంచుతోంది. రాజకీయ ఒత్తిళ్లే కారణమా.? లేక వ్యవస్థాగత వైఫల్యమా.? అన్న సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే జిహెచ్ఎంసి అవినీతి మయమైందన్న విమర్శలు కూడా జోరుగా




వినిపిస్తున్నాయి. మరి దీనిని ప్రభుత్వం ఏ మేరకు కట్టడి చేయగలదో వేచి చూడాలి.

### బాధ్యతాయుత పాలన ఉంటే 'నంబర్ వన్' ఎందుకు కాదూ.?

డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, జిహెచ్ఎంసి కమిషనర్ బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహిస్తే హైదరాబాద్ 'నంబర్ వన్' నగరంగా నిలవడం అసాధ్యం కాదన్నది నిపుణుల అభిప్రాయం. డిజిటల్ ట్రాకింగ్, టైమ్‌బౌండ్ అనుమతులు, విజిలెన్స్‌కు స్వతంత్ర అధికారాలు, కఠిన చర్యలు ఇవి అమలైతే వ్యవస్థలో మంచి మార్పు సాధ్యమవుతుందన్న విశ్లేషణ ఉంది. కానీ రేవంత్ సర్కార్ ఈ దిశగా అడుగులు వేయగలదా.?

### ప్రజల ప్రశ్న - చర్యలు ఎప్పుడు.?

జిహెచ్ఎంసిలో అవినీతి అధికారులపై చర్యలు ఎప్పటికీ ఉండవా.? ఫిర్యాదులకు న్యాయం ఎప్పుడు.? కోర్టులో ఉన్న వేయి ల కేసుల పై ఇప్పటివరకు కనీసం కౌంటర్ కూడా వెయలేని దుస్థితిలో పాలన సాగుతోందా., అన్న ప్రశ్నలు సామాన్యులను వెంటాడుతున్నాయి. హైదరాబాద్ వంటి అంతర్జాతీయ నగరంలో పాలనపై నమ్మకం కుదించుకుపోతే, అభివృద్ధి ఎలా సాధ్యం.? ఉన్నత అధికారులకు దీనిపై ఆలోచన ఎందుకు రావడం లేదని ప్రజల ప్రశ్నల వర్షం.

### విస్తరణ ప్రతిబింబించేనా.?

గ్రేటర్ విస్తరణ కాగితాలపై మాత్రమే కాకుండా పాలనలోనూ ప్రతిబింబించాలి. అవినీతి, అక్రమాలపై కఠిన చర్యలు, పారదర్శకత, బాధ్యతాయుత అధికార వ్యవస్థఇవే ప్రజల ఆకాంక్ష. లేకపోతే గ్రేటర్ విస్తరణ పేరు మాత్రమే మిగిలి, ప్రజల విశ్వాసం పూర్తిగా కోల్పోయే ప్రమాదం తప్పదన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

# అక్రమ నిర్మాణాలపై
# చర్యలు మరిచిన అధికారులు

- అవగాహన అనుభవం లేకుండా బిల్డర్లుగా అవతారం, జోరుగా అక్రమ నిర్మాణాలు
- చర్యలు తీసుకోవడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తిగా విఫలం
- నోటీసులు ఇచ్చి కూల్చివేతలు, సీజ్ చేయకుండా వదిలివేయడం లో అంతర్యమేమి.?
- జోరుగా అక్రమ అపార్ట్మెంట్ నిర్మాణాలు సీజ్ ఎప్పుడు జరిగేను

సీతాఫలమండి (ప్రశ్న న్యూస్) గత సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుంది. అధికారులను బిల్డర్లు భయాందోళనకు గురిచేస్తూ స్థానిక కార్పొరేటర్ల మద్దతుతో జోరుగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎన్ని ఫిర్యాదులు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గత %జూ% సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో బిల్డర్లు చేసే అక్రమ నిర్మాణాలకు రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధుల మద్దతు ఉందంటూ ఫిర్యాదుదారులను, అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు బిల్డర్లు. అధికారులు కూడా అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోకుండా వాళ్ల కు వత్తాసు పలుకుతున్న రాజకీయ నాయకుల ప్రజాప్రతినిధుల పేరు చెప్పి కాలక్షేపం చేయడం సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో సర్వసాధారణంగా మారింది.

### అధికారుల పూర్తి నిర్లక్ష్యం.

సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బిల్డర్లకు పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకోవడం లేదని కోర్టును ఆశ్రయిస్తే తప్ప అధికారులు స్పందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మరి ప్రభుత్వాన్ని నియమ నిబంధనలు ఎందుకో అధికారులకే తెలియాలి. భవనాల అనుమతి పత్రాలను రిపోర్టర్లకు కూడా అధికారులు ఇవ్వకుండా తమ అవినీతిని కప్పిపుచ్చుకోవడం ఎంతవరకు సమంజసమో.

### అనుమతి రెండంతస్తులు నిర్మాణాలు అయిదారంతస్తులు

రెండు, మూడు అంతస్తులకు అనుమతులు తీసుకొని అయిదారు అంతస్తులు నిర్మాణాలు చేయడం సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో సర్వసాధారణంగా మారింది. అయితే బిల్డర్ తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి అధికారులకు లంచాలు ఇచ్చి నిర్మాణం కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పక్కింటి నెంబర్ 12%-11-%1579 అక్రమ నిర్మాణం బౌద్ధ నగర్ డివిజన్ పరిధిలో రహదారిపై అక్రమ సెల్లార్ అక్రమ అంతస్తులతో కమర్షియల్ నిర్మాణం జరుగుతుంటే చర్యలు తీసుకోవలసిన అధికారులు బౌద్ధ నగర్ కార్పొరేటర్ పేరు చెప్పి మౌనంగా ఉండడం పలు అనుమానాలు తావిస్తుంది. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో కార్పొరేటర్లు అక్రమ నిర్మాణాల దందా జోరుగా చేస్తున్నారని ప్రతి అక్రమ నిర్మాణం వెనుక కార్పొరేటర్ హస్తము ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కార్పొరేటర్లు ప్రజల సమస్యలు తీర్చడం పక్కనపెట్టి అక్రమ నిర్మాణాలు చేయించి సొమ్ము చేసుకోవడమే ఆనయవాయితీగా పెట్టుకున్నారు. మరి ఇలాంటి అవినీతి కార్పొరేటర్ లను ఎందుకు ప్రజలు ఎన్నుకుంటున్నారో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికైన సికింద్రాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు,



# వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

**- ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన చైర్మన్ బీఆర్ నాయుడు**



తిరుమల (ప్రశ్న న్యూస్) వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని డిసెంబర్ 30 నుంచి పది రోజుల పాటు జరగనున్న వైకుంఠ ద్వార దర్శనానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. సోమవారం ఆయన ఈవో, ఇతర బోర్డు సభ్యులతో కలిసి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు స్పందిస్తూ, "గోగర్భం డ్యామ్ సర్కిల్, శిలాతోరణం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు, సదుపాయాలను పరిశీలించాము. ఎస్ఎస్డి టోకెన్ల తనిఖీ కేంద్రాల పనితీరును సమీక్షించి, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించాం. పోలీస్, విజిలెన్స్, టీటీడీ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ, ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా రద్దీని పర్యవేక్షిస్తున్నాం" అని వివరించారు. ఏకాదశి రోజున సుమారు 70,000 మంది భక్తులకు దర్శనం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకోసం 20 గంటల సమయం కేటాయించామని ఆయన తెలిపారు. డిసెంబర్ 30 నుంచి జనవరి 1 వరకు టోకెన్లు పొందిన భక్తులను మాత్రమే దర్శనానికి అనుమతిస్తారు. ఆ తర్వాత జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు ఎలాంటి టికెట్లు లేకపోయినా సర్వదర్శనం కల్పిస్తారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా 3,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. ఆలయాన్ని సుమారు 50 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల పండ్లతో శోభాయమానంగా అలంకరించారు. ఏకాదశి నాడు శ్రీవారు స్వర్ణ రథంపై మాడ వీధుల్లో విహరించనుండగా, ద్వాదశి నాడు స్వామి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తారు.

# షిరిడి సాయిబాబాపై అనుచిత వ్యాఖ్యలు

**- నటి మాధవీలతపై ఎఫ్ఐఆర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రముఖ సినీ నటి మాధవీలతపై హైదరాబాద్‌లోని సరూర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. షిరిడీ సాయిబాబా దేవుడు కాదంటూ ఆమె సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీశాయని అందిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. మాధవీలతతో పాటు ఈ వివాదాన్ని ప్రోత్సహించిన పలువురు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. గత కొద్దికాలంగా సామాజిక, రాజకీయ అంశాలపై సోషల్ మీడియాలో చురుగ్గా స్పందిస్తున్న మాధవీలత, ఇటీవల సాయిబాబాను ఉద్దేశించి కొన్ని పోస్టులు పెట్టారు. ఈ వ్యాఖ్యలు సాయిబాబా భక్తుల నమ్మకాలను కించపరిచేలా ఉన్నాయని కొందరు పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు, మాధవీలతతో పాటు ఆమెకు మద్దతుగా ఇంటర్వ్యూలు చేసి, వీడియోలు ప్రచారం చేసిన వారిపైనా కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాలని నిందితులందరికీ నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని ఇతరుల నమ్మకాలను కించపరిచినా లేదా అసత్య ప్రచారాలు చేసినా ఐటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వ్యూస్ కోసం వివాదాలను ప్రోత్సహించే యూట్యూబ్ ఛానెళ్లపై కూడా దృష్టి సారించినట్లు తెలిపారు.

# సమయం సరిపోదు..
# 15 రోజులు కావాలి

**- బీఏసీ సమావేశానికి హాజరైన హరీశ్ రావు**

**- అసెంబ్లీ సమావేశాలు ఎక్కువ రోజులు జరపాలని సూచన**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాల బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ తరపున మాజీ మంత్రి హరీశ్ రావు హాజరయ్యారు. సభ నిర్వహణపై ప్రభుత్వం ముందు ఆయన పలు కీలక డిమాండ్లు ఉంచారు. ముఖ్యంగా ప్రజల సమస్యలను విస్తృతంగా చర్చించాలంటే అసెంబ్లీ సమావేశాలు ఎక్కువ రోజుల పాటు జరగాల్సిందేనని ఆయన అన్నారు. బీఏసీ సమావేశం అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం అనేక ప్రజా సమస్యలు ఉన్నాయని, వాటన్నింటినీ సమగ్రంగా చర్చించాలంటే కనీసం 15 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాల్సిందేనని బీఆర్ఎస్ డిమాండ్ చేసిందన్నారు. కేవలం వారం రోజుల్లోనే అన్ని అంశాలపై చర్చించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి మూడు లేదా నాలుగు రోజుల్లో సభను ముగించడం సరికాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.మరోవైపు, ప్రస్తుతానికి ఒక వారం రోజుల పాటు సమావేశాలు నిర్వహించేందుకు అంగీకరించినట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, సమావేశాల సమయంలో పరిస్థితులను బట్టి అవసరమైతే మరిన్ని రోజులు పొడిగించే అంశంపై మరోసారి బీఏసీ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు హరీశ్ రావు వెల్లడించారు. దీంతో అసెంబ్లీ సమావేశాలు మొత్తం ఎన్ని రోజులు జరుగుతాయన్న దానిపై ఇంకా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. ఇదిలా ఉండగా, నదీ జలాల అంశంపై సభలో ఇప్పటికే రాజకీయ వేడి మొదలైంది. ఈ అంశంపై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడానికి సిద్ధమవుతుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా తమకూ అదే అవకాశం ఇవ్వాలని బీఏసీ సమావేశంలో డిమాండ్ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, నీటి ప్రాజెక్టుల వివరాలను ప్రజలకు వివరించేందుకు తమకు కూడా సమాన అవకాశాలు కల్పించాలని హరీశ్ కోరారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588